



తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలకు సింధియా నుంచి మల్కాపురం వెళ్లే ప్రధాన రహదారి చెరువులా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


లంకెలపాలెం జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నగరంలో భారీవర్షాలు కురుస్తుండడంతో ముందుజాగ్రత్తగా భారీవాహనాల రాకపోకలపై సీపీ శంఖబ్రతబాగ్చి ఆంక్షలు విధించారు. తీవ్రతుఫాన్ కారణంగా జాతీయ రహదారితోపాటు నగరంలో ముంపుతీవ్రత ఎక్కువగా ఉన్న రోడ్లపై కంటెయినర్ వంటి భారీ వాహనాలను అనుమతించవద్దని పోలీస్ అధికారులను ఆదేశించారు. వరద నీరు రోడ్ల పైనుంచి ప్రవహిస్తుండడం, రోడ్ల మధ్యలో ఉండే వంతెనలపై ఒత్తిడి ఎక్కువగా ఉండడం వల్ల ... మిగతా 6వ పేజీలో


లాసన్స్‌బే కాలనీ పార్కులో కూలిన చెట్టు

మొంథా ముసురు

- ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- పడిపోయిన గోడలు... పొంగిన డ్రైనేజీలు
- అత్యధికంగా ఆనందపురంలో 21 సెం.మీ. వర్షపాతం నమోదు

కొనసాగుతున్న వర్షాలు

- రహదారులపైకి నీరు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విశాఖపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాలు కొనసాగుతున్నాయి. ఈదురుగాలులకు చెట్లు కూలిపోతున్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. గోడలు పడిపోతున్నాయి. రహదారులపై మోకాలు లోతు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకూ ఆనందపురంలో 21 సెం.మీ., మహారాణిపేటలో 15 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

కూలిన చెట్లు

నగరంలో హుద్‌హుద్ తుఫాన్ అనంతరం కాలనీల్లో రహదారుల పక్కన ఎక్కువ సంఖ్యలో చెట్లు నాటారు. అవన్నీ ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం వీస్తున్న గాలులకు అవి వేళ్లతో సహా నేలకొరుగుతున్నాయి. గురుద్వారా నుంచి సీతమ్మధార వెళ్లే మార్గంలో ఓ చెట్టు విరిగి కారుపై పడింది.అలాగే ఏవీఎన్ కాలేజీ డౌన్‌లో కేజీహెచ్ గోడ కూలిపోయి ఆటో, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎంవీపీ కాలనీలోని 3, 5 సెక్టార్లలో చెట్లు కూలి ఇళ్లపై పడ్డాయి. కురుపాం టవర్స్ వద్ద ఒక చెట్టు విరిగి ప్రహరీపై పడింది. ఆర్‌సీడీ ఆస్పత్రి ఎదురుగా మరో చెట్టు కూలింది. ఏయూ, రైల్వే క్వార్టర్లలో చాలా చెట్లు పడిపోయాయి. ఇలా నగరంలో మొత్తం 130 వరకు చెట్లు కూలిపోయాయని అంచనా. వాటిలో 100 వరకు తొలగించగా, ఇంకా పనులు కొనసాగుతున్నాయి.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నగరంలో గెడ్డల పక్కన ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎనిమిది ప్రాంతాల్లో నేలకొరిగాయి. విశాఖ సర్కిల్ ఈపీడీసీఎల్ అధికారులు తక్షణమే స్పందించి ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యా సంస్థలకు సెలవు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ ప్రభావం విశాఖ జిల్లాపై కొనసాగుతున్నందున బుధవారం అన్ని యాజమాన్యాల పరిధిలో పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ మంగళవారం సాయంత్రం తెలిపారు. తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకుని సోమవారం, మంగళవారం విద్యా సంస్థలకు ముందే సెలవు ప్రకటించారు. వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికతో బుధవారం కూడా సెలవు ప్రకటించారు. ప్రజలు ఇళ్లకు పరిమితం కావాలని, అత్యవసరం అయితే కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌కు (0891-2590100, 0891-2590102)కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.


రైల్వే స్టేషన్ ఎదురుగా నిలిచిన నీరు

తొలగని ముప్పు

- నేటి ఉదయం వరకూ భారీ వర్షసూచన
- ఓడరేవుల్లో 9వ నంబర్ డేంజర్ సిగ్నల్స్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ మంగళవారం రాత్రి మచిలీపట్నం-హంసలదీవి మధ్య తీరం దాటినప్పటికీ విశాఖపట్నం జిల్లాలో బుధవారం ఉదయం వరకూ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల వరకు అత్యధికంగా ఆనందపురంలో 21, విశాఖ రూరల్‌లో 19, మహారాణిపేటలో 16, మధురవాడలో 15.6, హెచ్‌బీ కాలనీ, ఎండాడ, కాపులుప్పాడల్లో 15, స్వర్ణభారతి స్టేడియం వద్ద 14.5, దువ్వాడ, వేపగుంట, పెందుర్తిల్లో 14, గోపాలపట్నంలో 13.4, మధురవాడ, సాగర్‌నగర్‌లలో 13 సెంటీమీటర్ల వర్షపాతం ... మిగతా 6వ పేజీలో

కంట్రోల్ రూమ్‌లు

కలెక్టరేట్:	0891-2590100, 0891-2590102
జీవీఎంసీ:	1800 4250 0009, 9866909192 (వాట్సాప్), 0891-2869106
ఏపీఈపీడీఎల్:	7382299975
మెడికల్	:9993489519
ఫైర్:	101,0891-2563582
పంచాయతీ:	70138 16205
భీమిలి ఆర్డీవో:	8074425598
విశాఖపట్నం ఆర్డీవో:	0891-2562977

రైల్వే స్టేషన్ వెలవెల

తుఫాన్ నేపథ్యంలో భారీగా రైళ్లు రద్దు

- రీ షెడ్యూల్ చేసిన రైళ్లు గంటల తరబడి ఆలస్యం
- నేడు, రేపు కూడా పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మంగళవారం సికింద్రాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లే రైళ్లను రద్దు చేయడంతో విశాఖ రైల్వే స్టేషన్ బోసిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు చేరిన కొన్ని రైళ్లు గంటల తరబడి ప్లాట్‌ఫామ్‌లపై నిలిచిపోయాయి. తుఫాన్ తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విశాఖ నుంచి దక్షిణ మధ్య రైల్వే స్టేషన్ల మీదుగా నడిచే పలు రైళ్లను 12 గంటలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేశారు.



రైళ్లు రద్దవడంతో ఖాళీగా ప్లాట్‌ఫాం

రైళ్ల రద్దు

వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని విశాఖ నుంచి, విశాఖ మీదుగా నడిచే పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లను రైల్వే అధికారులు మంగళవారం ఉదయం అప్పటికప్పుడు రద్దు చేశారు. విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-సికింద్రాబాద్ ... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీపై తుఫాన్ ప్రభావం

కేవలం 50 శాతం ఓఆర్ నమోదు

- విశాఖ రీజియన్‌లో 200 సర్వీసులు రద్దు
- రాత్రి 9 గంటలకే డిపోలకు చేరిన బస్సులు

ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం ఆర్టీసీపై భారీగా పడింది. మంగళవారం అతితక్కువ ప్రయాణికులతో బస్సులు నడిచాయి. విశాఖ రీజియన్‌లోని అన్ని రూట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో రోడ్లపై చెట్లకొమ్మలు విరిగిపడడం, నీరు చేరడం తదితర సంఘటనల నేపథ్యంతో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావద్దని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో అనేకమంది ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. వ్యాపార సంస్థలు కూడా సెలవు ప్రకటించడంతో ఆర్టీసీ బస్సులన్నీ ఖాళీ అయ్యాయి.


ప్రయాణికులు లేక బోసిపోయిన ఆర్టీసీ కాంప్లెక్స్

200 బస్సులు రద్దు

విశాఖ రీజియన్‌లో ... మిగతా 6వ పేజీలో

24/7 వార్ రూమ్

- ప్రతి 50 కి.మీ.కొక నిపుణుల బృందం
- సహాయక చర్యలకు 17 డీజిల్ లోకోమోటివ్‌లు
- వాల్తేరు డీఆర్ఎం లలిత్ బొహ్రా


డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో వాల్తేరు డివిజన్‌కు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు డీఆర్ఎం లలిత్ బొహ్రా వెల్లడించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వర్షాల కారణంగా 24 రైళ్లను రద్దు చేసి, మరో 15 రైళ్లను రీషెడ్యూల్ చేశామన్నారు. సహాయక చర్యల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే...ప్రత్యామ్నాయంగా 17 డీజిల్ లోకో మోటివ్‌లు, జనరేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి 50 కి.మీ.కు ఒక నిపుణుల బృందాన్ని నియమించి, ఆ పరిధిలో సహాయక కార్యక్రమాలు జరిగేలా ఆదేశించామన్నారు. సమాచార వ్యవస్థ దెబ్బతింటే కమ్యూనికేషన్ కోసం శాటిలైట్ ఫోన్లు అందించామన్నారు. విశాఖపట్నంలో 24/7 వార్ రూమ్ ఏర్పాటుచేసి, అన్ని స్టేషన్లతో నిత్యం మాట్లాడుతూ, అక్కడి పరిస్థితులు తెలుసుకుంటూ తగిన సూచనలు ఇస్తున్నామన్నారు. అన్ని స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన ఆహార పదార్థాలు అందించడానికి తగినంత నిల్వలు కేటరింగ్ విభాగాల్లో ఉంచామన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

ఆ మార్గాలపై ప్రత్యేక దృష్టి

కొత్తవలస-కిరండోల్, కోరాపుట్-రాయగడ మార్గాల్లో కొండ చరియలు విరిగి పడి ట్రాకులు ధ్వంసమయ్యే ప్రమాదం ఉన్నందున సహాయక ... మిగతా 6వ పేజీలో

తుఫాన్ నేపథ్యంలో వందే భారత్‌కు దువ్వాడలో హాల్ట్

- ప్రయాణికుల విన్నపాన్ని మన్నించిన వాల్తేరు డివిజన్ అధికారులు


దువ్వాడ స్టేషన్‌లో ఆగిన వందే భారత్ రైలు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హాల్ట్ లేని స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఆపి తుఫాన్ బాధితులకు రైల్వే అధికారులు తమ వంతు సహకారం అందించారు. ఈ విషయంలో వాల్తేరు డివిజన్ సకాలంలో స్పందించింది. మొంథా తుఫాన్ ... మిగతా 6వ పేజీలో

విశాఖ-విజయవాడ విమానాలు నేడు రద్దు

- మిగిలినవి యథాతథం: ఇండిగో

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి విజయవాడ మధ్య నడిచే విమానాలను బుధవారం రద్దు చేసినట్టు విమానాశ్రయం అధికారులు మంగళవారం ప్రకటించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో మంగళవారం మొత్తం విమానాలన్నీ నిలిపివేశారు. సుమారుగా 56 సర్వీసులు రద్దయ్యాయి. అయితే బుధవారం ఉదయం నాటికి తుఫాన్ ప్రభావం తగ్గుతుందని భావించి యథాప్రకారం అన్ని సర్వీసులు నడపడానికి ఇండిగో సంస్థ ముందుకువచ్చింది. విజయవాడ-విశాఖపట్నం మధ్య మాత్రం విమానం నడపడం లేదని తెలిపారు. ఆ మార్గంలో ఇబ్బందులు ఉన్నందున, దానిని మినహాయించి మిగిలిన మార్గాల్లో విమానాలు నడపనున్నట్టు వివరించారు.



మరో 24 గంటలు కీలకం

- మరింత అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు ప్రత్యేకాధికారి, ప్రభుత్వ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ సూచన


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర స్పెషల్ సీఎస్ అజయ్ జైన్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఉన్నారు.

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తీవ్ర తుఫాన్ మంగళవారం రాత్రి తీరం దాటనున్నందున, మరో 12 గంటలపాటు అప్రమత్తంగా ఉండామని అధికారులకు కోస్తాంధ్రలోని తొమ్మిది జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ పిలుపునిచ్చారు. ఎంపీ ఎం.శ్రీభరత్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌తో కలిసి ఆయన కలెక్టరేట్‌లోని వీసీ హాలులో మంగళవారం రాత్రి మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ మొంథా ప్రభావం ఉంటుందని, ప్రధానంగా కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలపై ఎక్కువ ఉంటుందన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

తక్షణ సహాయ బృందాలు ఏర్పాటు: కలెక్టర్

సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు విశాఖ జిల్లాలో 147 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ... మిగతా 6వ పేజీలో


కేటీపేట ఇండేన్ గ్యాస్ గొడౌన్ రోడ్డులో నిలిచిన నీరు


వెల్లంకి వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న సీపీ, డీపీవో


పాతసరదేసిపాలెం వద్ద గంభీరం గెడ్డ ప్రవాహం


విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్న కానిస్టేబుల్

వణికించిన మొంథా

- లోతట్టు ప్రాంతాలు జలమయం, కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిర్వాసితులు పునరావాస కేంద్రాలకు తరలింపు
- వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే గంటా విస్తృత పర్యటన
- నీటమునిగిన పంట పొలాలు, కూరగాయల పంటలు

ఆనందపురం/ విశాలాక్షినగర్/ సాగర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆనందపురం, విశాలాక్షినగర్, సాగర్‌నగర్ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రభావిత ప్రాంతాలను మంగళవారం పర్యటించారు. తుఫాను కారణంగా 80 శాతం కొట్టుకుపోయిన శిర్లపాలెం నుండి పేకేరుకు వెళ్లే రహదారి మధ్యలో ఉన్న కల్వర్టును పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన రహదారి పనులకు మరమ్మతులు చేయ్యాలని అధికారులను ఆదేశించారు. సీతకొండ ప్రాంతంలో కొండ చరియలు విరిగి పడడంతో ఆ ప్రాంతాన్ని గంటా పరిశీలించారు. కొండ చరియలు రోడ్డు మీద లేకుండా చర్యలు తీసుకోవాలని జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి సూచించారు. సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లో పరిస్థితిని తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా జీవభృతిని కోల్పోతున్నామని మత్స్యకారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ఉన్నారు. ఆనందపురంమండలంలోని వెల్లంకి జాతీయ రహదారి పైకి వర్షం నీరు చేరి చెరువులా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవడంతో సీపీ శంఖబ్రతబాగ్చి, జిల్లా పంచాయితీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాస్ చేరుకుని జేసీబీ సహాయంతో గండికొట్టి నీటిని మళ్లించారు.

ముందస్తు చర్యలు తప్పనిసరి

భీమునిపట్నం, (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్టు భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాధుర్ తెలిపారు. మంగళవారం ఉదయం తీర ప్రాంత గ్రామాల్లో ఆయనతో పాటు తహశీల్దార్ పైల రామారావు, భీమిలి జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది తుఫాను పునరావాస కేంద్రాలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తాటిపూడి రిజర్వాయర్ గేటు ఎత్తివేయడం వల్ల గోస్తనీ మీదుగా ఉప్పుటేరుకు నీటి ప్రవాహమట్టం పెరుగుతోందన్నారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వాసితులను తరలిస్తున్నట్టు వెల్లడించారు. ప్రమాద పరిస్థితులు ఎదురైతే వెంటనే సమాచారాన్ని అధికారులకు అందించాలని అప్రమత్తం చేశారు. అనంతరం ఆ ప్రాంత మత్స్యకారులతో మాట్లాడారు.

కెరటాల ఉధృతి

భీమిలి పట్టణంలోని బీచ్‌రోడ్డులో ఉధృత కెరటాలు తీరాన్ని తాకుతున్నాయి. దీంతో భోయవీధి, నోవాటెల్ వద్ద రహదారి కోతకు గురవుతోంది. ఉదయం నుంచి ఈదురుగాలులుతో వర్షం కురుస్తున్నప్పటికీ మధ్యాహ్నం కాస్త తెరిపిచ్చింది. ఉప్పుటేరు ఒడ్డును మత్స్యకారులు ఒడ్డున తాళ్లతో కట్టుకున్న బోట్లు, నిరుపయోగంగా ఉన్న పోర్టు కార్యాలయంలో భద్రపరుచుకున్న వలలు, సామగ్రి పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. సాయంత్రం అయిదున్నర గంట తర్వాత ఆకాశం కారుమబ్బులతో బీచ్‌రోడ్డు చీకటిగా మారి ఈదురుగాలుల వేగం పెరగడంతో భారీ వర్షంతో ప్రజలు భయపడుతున్నారు


బోయవీధి మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్‌మాధుర్


కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

ఇళ్లలోకి, అపార్టుమెంటులోకి చేరిన నీరు

కొమ్మాది, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మధురవాడ పరిసర ప్రాంతాల్లో సోమవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ సందర్భంగా 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పీపీ1 కాలనీలో చెరువు పొంగడంతో కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి ఎక్స్‌కవేటర్ సాయంతో నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మధరవాడ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా కొమ్మాది టీచర్స్ లేఅవుట్, జీసీసీ లేఅవుట్‌లోని వరద నీరు ఎక్కువగా చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని జోన్-2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తగరపువలసలో

తగరపువలస, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధి చిల్లపేట సమీపంలో ఉన్న సుభీభవ కాలనీలోకి వర్షం నీరు చేరింది. దీంతో స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా నిర్మించిన ఈ కాలనీ లోతట్టు ప్రాంతంలో ఉండడమే కాకుండా చిల్లపేట చెరువును ఆనుకుని ఉంది. దీంతో వర్షపు నీరు ఈ ప్రాంతానికి చేరింది. పలు ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. ఈ విషయాన్ని తెలుసుకొని 2వ వార్డు కార్పొరేటర్ జి.చిన్నికుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఇతర జీవీఎంసీ సిబ్బంది ఈ కాలనీని మంగళవారం సందర్శించారు. నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

భీమునిపట్నం (రూరల్) (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం సింగనబంద గ్రామ పంచాయతీ పరిధిలో నరసయ్య చెరువును ఆనుకుని ఉన్న అక్రమాని కల్లాలు ప్రాంతంలో ఉన్న అయిదు కుటుంబాలకు చెందిన ఇళ్లు నీట మునిగిపోయాయి. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఆ కుటుంబాలను సమీపంలో ఉన్న కృష్ణంరాజుపేట ప్రభుత్వ పాఠశాలకు తరలిచారు. రెండురోజుల పాటు వీరిని పునరావాస కేంద్రంలో ఉండాలని సూచించారు.

మొంథా తుపాను నేపథ్యంలో తమ గ్రామానికి 'ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని..' చూడకుండా భీమిలి మండలం మజ్జివలస గ్రామస్థులు తామే కలసికట్టుగా ముందడుగు వేశారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి నష్టం జరగకుండా అప్రమత్తమయ్యారు. ప్రమాదం ఉన్న చోట ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో శిథిల స్థితిలో ఉన్న ఇళ్లను గుర్తించి అందులో నివాసముంటున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షం నీరు సజావుగా పారేందుకు కాలువలను శుభ్రం చేశారు. గ్రామంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. వివిధ లోతట్టు ప్రాంతాలను అధికారులు మండల స్థాయి నాయకులు పర్యటిస్తుండగా తమ గ్రామాన్ని తామే చైతన్యం చేయగలమని ఈ గ్రామ నాయకులు పేర్కొన్నారు. గ్రామంలో తుపాన్ తాకిడి ఎక్కువగా ఉంటే ప్రభుత్వ పాఠశాలను పునరావాస కేంద్రంగా వినియోగించడానికి గల అవకాశాలను వీరు పరిశీలించారు

రహదారులు జలమయం, కూలిన ఇంటి పైకప్పు

మధురవాడ, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మధురవాడ పరిసర ప్రాంతాలు జలమయం అయ్యాయి. స్వతంత్రనగర్, మిథిలాపురి, ఉడాకాలనీ తదితర ప్రాంతాల్లో రహదారుకలు ఇరువైపులా చెట్ల కొమ్మలు విరిపడ్డాయి. ఈ సందర్భంగా జడ్సీ కనకమహాలక్ష్మి, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీరాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు తదితరులు వాంబే కాలనీలోని పర్యటించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వాంబే కాలనీలోని ఓ ఇంటిపై కప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదే కాలనీలో గృహాల పోర్టికోలు నానిపోవడంతో అవి కూలిపోయే పరిస్థితి ఉన్నదని స్థానికులు జోనల్ కమిషనర్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు

స్వచ్ఛందంగా తాగునీటి సరఫరా

మధురవాడ, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా తాగునీటికి ఇబ్బంది కలగకుండా ప్రజలకు రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశరావు సొంత నిధుతో పలుకాలనీలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించారు. తుఫాను కారణంగా ఇబ్బంది పడుతున్న ప్రజలకు తన వంతు సహకారం అందిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఏకమైన వాగులు, గెడ్డలు

పద్మనాభం, (ఆంధ్రజ్యోతి): మొంథా తుపను కారణంగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు ఏకమయ్యాయి. విజయానందపురం జంక్షన్, వెంకటాపురం, పద్మనాభం జంక్షన్, మద్ది ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి. ఈ సందర్భంగా సింహాచలం నుంచి విజయనగరం వెళ్లే బస్సులు నిలిచిపోయాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో ఉన్న కాలువల్లో పూడికలు తీయకపోవడంతో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని పలువురు మండల ప్రత్యేకాధికారులు తెలిపారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

సింహాచలం, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల కురుస్తున్న భారీ వర్షం వల్ల సోమవారం రాత్రి సింహాచలంలోని కరెంటు వైర్లు తెగిపడ్డాయి. కృష్ణాపురం నృశింహవనంలో చెట్టు కొమ్మలు విరిగి పడి వైర్లు తెగిపోవడంతో గోశాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అదే విధంగా మెట్ల మార్గంలో వేగవతి ధార వద్ద కరెంటు వైర్లు తెగిపడడంతో అప్పన్న ఆలయానికి విద్యుత్ సరఫరా లేదు. ప్రస్తుతం జనరేటర్ సాయంతో విద్యుత్ సరఫరా చేసి మరమ్మతులు నిర్వహిస్తున్నారు.

నిరంతరం నిఘా

పద్మనాభం-రూరల్,(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి జోరు వానలు పడుతున్నాయి. వీచిని ఈదురు గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా కరుస్తున్న వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. తుఫాను నేపథ్యంలో లోతట్టు గ్రామాల్లో ఉద్యోగులతో నిరంతరం నిఘా ఉంచామని మండల ప్రత్యేక అధికారి జ్ఞనవేణి తెలిపారు. మంగళవారం గోస్తాని పరివాహక ప్రాంతాల్లో అధికారల బృందంతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంట్రోల్ రూం వద్ద పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మరో 12 గంటలు కీలకం

... 5వ పేజీ తరువాయి

వెల్లడించారు. మంగళవారం ఉద యం 8.30 నుంచి సాయంత్రం మూడు గం టల వరకు 1.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. జీవీఎంసీ పరిధిలో జోన్‌కు రెండు చొప్పున క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను, డ్రెయిన్లలో పూడికను తొలగిస్తున్నామని వివరించారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ములగాడ, సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయని, ఇతర చోట్ల రాళ్లు జారాయన్నారు. ప్రజలు ఏదైనా అత్యవసరమైతే హెల్ప్‌లైన్ నంబర్లు 0891-2590100, 96669 09192, 18004250009కు సంప్రతించాలన్నారు.

సరదాలకు సమయం కాదు: ఎంపీ శ్రీ భరత్

ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ కొందరు బీచ్‌లో సెల్ఫీలు తీసుకుంటున్నారని, దయచేసి అలా చేయవద్దని హితవు పలికారు. సరదాలకు ఇది సమయం కాదన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించానని, అధికారులు, సిబ్బంది పక్కాగా చర్యలు చేపట్టారన్నారు.

సమీక్షించిన మంత్రి

మంగళవారం రాత్రి జిల్లా అధికారులతో ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మరో 24 గంటలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

మొంథా ముసురు

... 5వ పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.

నానిపోయి పడిపోయిన గోడలు

నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బలహీనంగా ఉన్న ప్రహరీ గోడలు నానిపోయి మంగళవారం పలు ప్రాంతాల్లో కూలిపోయాయి. టింపనీ స్కూల్ ప్రహరీ ఒకవైపు కూలిపోగా, అదే ప్రాంతంలో ఖాళీ స్థలం చుట్టూ నిర్మించిన గోడ పడిపోయింది. కేజీహెచ్ గోడ రెల్లివీధి వైపు కూలిపోయింది. కొండవాలు ప్రాంతాల్లో చాలాచోట్ల ఇళ్ల వెనుక నిర్మించుకున్న గోడలు పడిపోయాయి. ఇలా మొత్తం ఎనిమిదిచోట్ల గోడలు పడిపోయినట్టు అధికారుల దృష్టికి వచ్చింది. బీచ్‌రోడ్డులో సీతకొండ వద్ద బండరాళ్లు జారి పడడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెళ్లి పరిశీలించారు. ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. ఆర్కే బీచ్ నుంచి రుషికొండ వరకూ బీచ్‌లలోకి ఎవరూ వెళ్లకుండా 18 మంది లైఫ్ గార్డులను పెట్టారు. అయితే వారెవరికీ కనీసం రెయిన్ కోట్లు కూడా సమకూర్చలేదు. వర్షంలో తడుస్తూనే విధులు నిర్వహించారు.

రైల్వేస్టేషన్ ఎదుట నిలిచిన నీటి సరఫరా

నగరంలో చాలాచోట్ల వరద నీరు రహదారులపై నిలిచిపోయింది. రైల్వేస్టేషన్ ఎదురుగా కార్నర్‌లో నీరు ప్రవహించే మార్గాలు మూసుకుపోవడంతో రెండు అడుగుల ఎత్తున నీరు నిలిచిపోయింది. జీవీఎంసీ అధికారులు సిబ్బందిని రంగంలోకి దించి పనులు చేపట్టారు. వెలంపేట, కేఆర్‌ఎం కాలనీ, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, చావులమదుం తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఇలా 30 ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోగా 20 చోట్ల అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిండిపోయి మ్యాన్‌హోళ్లు పైకి లేచిపోయి మురుగు రోడ్లపైకి వచ్చింది. ఇలా సుమారుగా 20 చోట్ల మ్యాన్‌హోళ్ల మూతలు పైకి లేచాయి. వాటిలో పదింటిని సరిచేశారు. ఇంకా మరికొన్ని పనులు చేపట్టాల్సి ఉంది.

మల్కాపురం-సింధియా మార్గంలో నిలిచిన రాకపోకలు

మల్కాపురం-సింధియా మార్గంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి డివైడర్ కనిపించకుండా పోయింది. సుమారు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. నీరు పక్కనున్న ఏకేసీ కాలనీలోకి ప్రవేశించింది. సుమారు 400 కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ దగ్గరుండి పనులు చేయించారు.

తుఫాన్ నేపథ్యంలో వందే భారత్‌కు దువ్వాడలో హాల్ట్

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో విశాఖ మీదుగా విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్లే రైళ్లు సుమారు 60 వరకు మంగళవారం రద్దు చేశారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వందేభారత్ రైళ్లను మాత్రమే నడిపారు. ఈ రైలు మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో 5.05 గంటలకు బయలుదేరింది. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం చేరాల్సి ఉంది. ప్రయాణికుల్లో చాలా మంది అనకాపల్లి, స్టీల్‌ప్లాంటు, ఫార్మాసిటీ ప్రాంతాలకు చెందిన వారున్నారు. వందేభారత్ రైలు అన్ని స్టేషన్లలో ఆగదు. చాలా తక్కువ స్టాపులు. సామర్లకోట స్టాప్ తరువాత నేరుగా వచ్చి విశాఖపట్నంలోనే ఆగుతుంది. అయితే వర్షాలు అధికంగా కురుస్తున్న తరుణంలో తామంతా విశాఖ వెళ్లి అక్కడి నుంచి కార్లు, ఆటోలు పట్టుకొని దువ్వాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలకు వెనక్కి రావాలంటే ఇబ్బంది అవుతుందని, తుఫాన్ నేపథ్యంలో అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఈ రైలును ఆపాలని ప్రయాణికుల్లో కొందరు రైల్వే యాప్‌లో రిక్వెస్ట్ చేశారు. మరికొందరు అనకాపల్లి ఎంపీకి, విశాఖ ఎంపీకి సమాచారం ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి' కూడా తన వంతు ప్రయత్నంగా వాల్తేరు డీఆర్‌ఎంకు ప్రయాణికుల విన్నపాన్ని చేరవేసింది. హైదరాబాద్ నుంచి అనకాపల్లి వరకు దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి. అక్కడి అధికారులు విన్నపాన్ని పట్టించుకోలేదు. వాల్తేరు డివిజన్ అధికారులు మాత్రం ఈస్ట్ కోస్ట్ జోన్ అధికారులతో సంప్రతించి దువ్వాడలో రైలు ఆపడానికి అనుమతి తీసుకున్నారు. ఇదే విషయాన్ని రైలులోని మైకులో ప్రయాణికులకు వినిపించారు. దాంతో చాలా మంది ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు దువ్వాడలో రైలు ఆగగానే సుమారు 100 మంది వరకు అక్కడ దిగారు. తమ విన్నపాన్ని మన్నించినందుకు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వందే భారత్ ఇలా హాల్ట్ లేని స్టేషన్‌లో ఆగడం డివిజన్‌లో ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీసీపై తుఫాన్ ప్రభావం

... 5వ పేజీ తరువాయి

మంగళవారం 200 సర్వీసులను రద్దు చేశారు. హైదరాబాద్‌కు ఎనిమిది బస్సులు వెళ్లాల్సి ఉండగా మూడు మాత్రమే నడిపారు. విజయవాడకు గంటకు బస్సు నడపాల్సి ఉండగా మూడు గంటలకు ఒక సర్వీస్ ఆపరేట్ చేశారు. తిరుపతి, బెంగళూరు, చెన్నై, గుణుపూర్, నవరంగపూర్, భువనేశ్వర్ సర్వీసులు రద్దు చేశారు. కాకినాడ, రాజమండ్రిలకు 40 నిమిషాల వ్యవధిలో షెడ్యూల్ సర్వీసులు ఉండగా రెండు గంటల ఫ్రీక్వెన్సీతో నడిపారు. శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు నడిచేది. వీటిని గంటకు ఒకటి చొప్పున నడిపారు. ముందుగా సీట్లు రిజర్వు చేసుకున్నవారు టికెట్లు రద్దు చేసుకోవడంతో ప్రయాణికుల సంఖ్య మరింత తగ్గింది. దీంతో సగటు ఆక్యుపెన్సీ రేషియో 50 శాతానికి పడిపోయింది. ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులు లేక వెలవెలబోయింది. తుఫాన్‌కు ముందు రోజూ 740 సర్వీసులు 85 నుంచి 90 శాతం సగటు ఓఆర్‌తో నడిచేవి. మంగళవారం 540 బస్సులు నడపగా, 50 శాతం మాత్రమే ఓఆర్ నమోదయింది. రెండేళ్లలో ఇదే తక్కువని అధికారులు తెలిపారు. కాగా సాయంత్రం నుంచి బస్సులన్నీ ఖాళీ అయ్యాయి. దీంతో రాత్రి తొమ్మిది గంటలకే సంబంధిత డిపోలకు చేర్చాలని అధికారులు నిర్ణయించారు.

తొలగని ముప్పు

... 5వ పేజీ తరువాయి

నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పద్మనాభంలో 5.3, అక్కిరెడ్డిపాలెం, గోస్తనీ పంపుహౌస్‌లో 5.2, వేపగుంటలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2018 సంవత్సరం (తితిలీ తుఫాన్ సమయాన) తరువాత మరోసారి విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం ఓడరేవుల్లో తొమ్మిదో నంబరు డేంజర్ సిగ్నల్స్ ఎగురవేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

... 5వ పేజీ తరువాయి

భారీవాహనాలు వెళితే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం వుంటుంది కాబట్టి ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి నగరంలోకి వచ్చే భారీవాహనాలను జాతీయ రహదారి వెంబడి ఉన్న హోల్డింగ్ పాయింట్ల వద్ద నిలిపేస్తామని సీపీ తెలిపారు.

పునరావాస కేంద్రాలకు 138 మంది తరలింపు

- ఎనిమిదిచోట్ల కూలిపోయిన ప్రహరీలు
- నేలవాలిన 134 చెట్లు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లోని వారిని జీవీఎంసీ పునరావాస కేంద్రాలకు తరలించారు. తుఫాన్ నేపథ్యంలో 79 చోట్ల పునరావాస కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. మంగళవారం భారీవర్షాలు కురవడంతో 138 మందిని 13 పునరావాస కేంద్రాలకు తరలించారు. నగర పరిధిలో 134 చెట్లు కూలిపోయాయి. సీతమ్మధార వసంతబాల ఉన్నత పాఠశాల సమీపంలో చెట్టుపడిపోవడంతో కారు ధ్వంసమయింది. 111 కూలిన చెట్లను జీవీఎంసీ హార్టీకల్చర్, ప్రజారోగ్య విభాగం సిబ్బంది తొలగించారు. పది చోట్ల విద్యుత్ స్తంభాలు, ఐదుచోట్ల ప్రహరీ కూలిపోయాయి. వన్‌టౌన్‌లోని ఏవీఎన్‌కాలేజీ డౌన్‌లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రహరీ కూలిపోవడంతో పార్కింగ్‌చేసిన ఆటో ధ్వంసమైంది. సీబీఎం కాంపౌండ్ టింపనీ పాఠశాల ప్రహరీతోపాటు ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ ప్రహరీ , ఆరిలోవ క్రాంతినగర్‌లో రెండు ఇళ్ల ప్రహరీలు కూలిపోయాయి. బీచ్‌రోడ్డులో సీతకొండ వద్ద కొండచరియలు జారి రోడ్డుపైకి దొర్లాయి. నగరంలో వరదనీరు యూజీడీల్లో కలిసిపోవడంతో 21 చోట్ల పైప్‌లైన్ జామ్ అయి మ్యాన్‌హోల్‌పై కప్పులు తెరుచుకుని మురుగు రోడ్డుపైకి వచ్చింది. 15 చోట్ల సిబ్బంది సమస్యను పరిష్కరించారు. 28 చోట్ల వరదనీరు నిలిచిపోయింది. మల్కాపురం పోలీస్‌స్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ఏకలవ్యకాలనీ నీటమునిగింది. అక్కడి వందకుపైగా కుటుంబాలను సమీపంలోని పునరావాసకేంద్రానికి తరలించారు. వన్‌టౌన్‌లోని ఎర్రిగెడ్డ పొంగిపోవడంతో వర్షంనీరు సముద్రంలోకి వెళ్లడానికి అవకాశం లేక రామకృష్ణథియేటర్ పరిసర ప్రాంతాలను ముంచెత్తడంతో రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షంనీరు చేరిపోవడంతో నివాసితులు బయటకు తోడుకోవాల్సి వచ్చింది. వరదల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని 202 మంది జీవీఎంసీ కంట్రోల్‌రూమ్‌లకు ఫిర్యాదుచేయగా 164 ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించారు.

కలెక్టరేట్‌లోనే కలెక్టర్ బస

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తీవ్రతుఫాన్ మంగళవారం రాత్రి తీరం దాటే క్రమంలో అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోనే బసచేశారు. తన చాంబర్, తుఫాన్ కంట్రోల్‌రూమ్ నుంచి పరిస్థితి సమీక్షించారు. ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని ,ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. తుఫాన్ తీరందాటే వరకు, ఆ తరువాత జిల్లాలో వర్షాలు, గాలుల ప్రభావం ఉంటుందని, దీంతో అధికారులు బుధవారం ఉదయం వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్నివిభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కాగా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం సాయంత్రం మేహాద్రిగెడ్డరిజర్వాయర్‌ను సందర్శించారు.

జియో హెరిటేజ్ స్థలం గుర్తించేందుకు కమిటీ

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం మండలం నేరెళ్లవలసలోని సర్వే నంబరు 118/5ఏ (పాత సర్వే నంబరు 49/1)లో జియో హెరిటేజ్ స్థలం గుర్తించి, దానికి సరిహద్దులు నిర్ణయించి, కాంక్రీట్ స్తంభాలు వేయాలంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జియో హెరిటేజ్ స్థలంలో తవ్వకాలు జరుపుతున్నారని, లేఅవుట్లు వేస్తున్నారని పలువురు హైకోర్టులో ప్రజా ప్రయోజనం వ్యాజ్యం వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ ఈ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి ఒక కమిటీని ఏర్పాటుచేయాలని సూచించింది. వీఎంఆర్‌డీఏ నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సర్వే సెటిల్‌మెంట్ విభాగం (రెవెన్యూ) నుంచి ఆర్‌డీఓ, గనుల శాఖ నుంచి డిప్యూటీ డైరెక్టర్, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి డైరక్టర్ వి.దుర్గాప్రసాద్, సీనియర్ జియాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ దొరడ్లతో కమిటీ వేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. గుర్తించిన స్థలం చుట్టూ కాంక్రీట్ పిల్లర్లు నిర్మించిన తరువాత కమిటీ అక్కడకు వెళ్లి అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాలని పేర్కొన్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్


దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. కైలాసపురం, శాంతినగర్, కస్తూరినగర్, మాధవధార, అంబేడ్కర్ కాలనీల్లో పర్యటించిన ఆయన పరిస్థితులను సమీక్షించి అధికారులు, ప్రజలను అప్రమత్తం చేశారు. కొండచరియలు విరిగిన ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో కొండవాలు ప్రాంతాల్లో ఉండడం ప్రమాదకరమని, ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ సిబ్బంది ఎలాంటి సహాయమైనా అందిస్తారన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని, పరిస్థితులు మారే వరకు అక్కడ తలదాచుకోవాలన్నారు. మాదవధార అంబేడ్కర్ కాలనీలోని వాంబే గృహ సముదాయంలో పాక్షికంగా దెబ్బతిన్న గోడను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట జోనల్ ప్రత్యేక అధికారి మాధవి, రెవెన్యూ, ఇతర అధికారులున్నారు.

24/7 వార్ రూమ్

... 5వ పేజీ తరువాయి

చర్యలు, మెటీరియల్ సరఫరా కోసం ప్రత్యేక రైళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. అదేవిధంగా రాయగడ-విజయనగరం, దువ్వాడ-విశాఖపట్నం-పలాస సెక్షన్‌లో సైతం తగిన జాగ్రత్తలు చేపట్టామన్నారు. రైల్వే బ్రిడ్జిలు, ట్రాకులు, యార్డులు, సిగ్నల్ పాయింట్ల వద్ద పెట్రోలింగ్‌తో పాటు వాచ్‌మెన్లను కూడా నియమించామన్నారు. ఎక్కడ ఏమి జరిగినా తక్షణమే సమాచారం వచ్చేలా, తగిన సహాయం అందేలా చూస్తున్నామన్నారు.

రైల్వేస్టేషన్ వెలవెల

... 5వ పేజీ తరువాయి

దురంతో (22203), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్(12739), విశాఖ-నాందేడ్ సూపర్‌ఫాస్ట్ (20811), విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), విశాఖ-మచిలీపట్నం (17220), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), విశాఖ-రాజమండ్రి (67286), విశాఖ-కాకినాడ పోర్టు (17268), విశాఖ-గుంటూరు (22875) వంటి విశాఖ ఒరిజినేటింగ్ రైళ్లతో పాటు విశాఖ మీదుగా నడిచే భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రైళ్లను మంగళవారం రద్దు చేశారు.

అదనపు కౌంటర్ల ద్వారా టికెట్ల సొమ్ము వాపసు


రద్దు చేసిన రైళ్లకు సంబంధించిన రిజర్వేషన్ టికెట్ల సొమ్మును ప్రయాణికులకు యుద్ధప్రాతిపదిన వాపసు చేశారు. రిజర్వేషన్ కేంద్రాలలో టికెట్ పొందినవారు వాల్తేరు రైల్వే అధికారులు ఏర్పాటుచేసిన అదనపు కౌంటర్ల ద్వారా నిమషాలలోనే సొమ్ము వాపసు తీసుకున్నారు.

రైళ్ల రీ షెడ్యూల్

తుఫాన్ ముందస్తు జాగ్రత్తలో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన కోరమండల్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు పలు రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. వీటిలో షాలిమార్-చర్లపల్లి ఈస్ట్‌కోస్ట్ (18045), షాలిమార్-చెన్నై ఎగ్మోర్ (22825), హౌరా-బెంగళూరు (22887), హౌరా-చెన్నై సెంట్రల్ కోరమండల్ (12841), సంత్రాగచ్చి-చెన్నై (22807), షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22853) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి 12 గంటల ఆలస్యంగా బయలుదేరాయి. ఇక బిలాస్‌పూర్-తిరుపతి (17481), ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఏడు గంటలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు. భువనేశ్వర్-పుణే ఎక్స్‌ప్రెస్ (22882) రెండున్నర గంటలు, అగర్తాల-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12504) గంటన్నర, ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18190) తొంబై నిమషాలు ఆలస్యంగా బయలుదేరాయి.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

బుధవారం విశాఖ-మచిలీపట్నం (17220), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), భువనేశ్వర్-హైదరాబాద్ ప్రత్యేక రైలు (07166) రద్దు కాగా, గురువారం (30న) లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520), ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17479) రైళ్లను రద్దు చేశారు.


బీచ్ రోడ్డు : ఫిషింగ్ హార్బర్ వద్ద ఉవ్వెత్తున్న ఎగిసి పడుతున్న అలలు


ఎంవీపీ కాలనీ : రైతు బజార్‌కు కొనుగోలుదారుల తాకిడి


వెంకోజీపాలెం : విద్యుత్ అధికారులు, స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి


మద్దిలపాలెం : శివాజీపార్కు రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

మొంథా అలజడి

- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం బిజీబిజీ
- నష్ట నివారణకు పకడ్బందీగా ప్రణాళికలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. నిర్వాసితుల పునరావాస కేంద్రాలకు తరలింపు
- పలు చోట్ల నేలకొరిగిన చెట్లు.. దెబ్బ తిన్న వాహనాలు.. పడిపోయిన విద్యుత్ స్తంభాలు

నగరంలో మొంథా తుపాను బీభత్సం సృష్టించింది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఈదురు గాలులు తోడవడంతో పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. అనేక చోట్ల చెట్లు కార్లపై పడడంతో వాహనాలు పాడయ్యాయి. ఎక్కడికక్కడే వరద నీరు నిలిచిపోయింది. కొండవాలు ప్రాంతాల్లో మరిన్ని సమస్యలు ఎదురయ్యాయి. కొండలపై నివాసం ఉండే వారు రాకపోకలు సాగించే మార్గాలు కూలిపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులకు గురయ్యాయి. అయితే అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా మెలగడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో భారీ నష్టం, పెను ప్రమాదాలు ఎదురు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


బీచ్‌రోడ్డులో ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు

బీచ్ రోడ్డులో పోలీస్ గస్తీ

- సందర్శకులు రాకుండా, వ్యాపారాలు నిర్వహించకుండా హెచ్చరికలు

బీచ్ రోడ్డు, అక్టోబర్ 28, (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆర్కే బీచ్ సముద్ర తీరం మంగళవారం బలమైన కెరటాలతో అలజడిగా మారింది. కడలి అల్లకల్లోలంగా మారి అలలు తీరం పైపు బాగా ముందుకు వచ్చాయి. ఫిషింగ్ హార్బర్ చేపలరేవు ప్రాంతంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. సముద్రం అత్యంత అలజడిగా మారిన నేపథ్యంలో మంగళవారం మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విశాఖలోని తుఫాన్ హెచ్చరికల కేంద్రం సూచించింది. బీచ్ రోడ్డు వద్ద టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తీరం వెంబడి, రోడ్డు మీద ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తొలగించారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉండడంతో ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకున్నారు. బీచ్ రోడ్డులో పలు చోట్ల పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. పర్యాటకులు సముద్ర తీరంలోకి పోవద్దంటూ వాహనాల్లో సంచరిస్తూ మైకులు పట్టుకొని ప్రకటనలు చేశారు.

బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. బీచ్ రోడ్డు వద్ద రహదారులు జలమయమయ్యాయి. పోలీసులు తీరంలోని దుకాణాలను మూయించారు. కెరటాల చెంతకు పర్యాటకులు వెళ్లరాదని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మణమూర్తి పేర్కొన్నారు. తుపాన్ పట్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. రానున్న రెండు రోజులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

వాహనాలపై పడిన చెట్లు


ఇంటి ముందు పార్క్ చేసిన కారుపై పడిన చెట్టు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుపాను తాకిడి నగరంలో కొంతమేర ఇబ్బందులు సృష్టించింది. అనేక చోట్ల చెట్లు కొమ్మలు విరిగి, కొన్ని చోట్ల వేళ్లతో సహా వృక్షాలు నేలకొరిగాయి. ఒక్కోచోట ఇళ్లపై, కార్లపై చెట్లు పడడంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. లాసన్స్ బే కాలనీలో చెట్టు విరిగి పడటంతో ఓ కారు దెబ్బతింది. ఎంవీపీ కాలనీ మూడో సెక్టరులోని ఓ వీధిలో భారీ వృక్షం ఓ ఇంటిపై పడింది. ఈ సంఘటనల్లో ఎవరికీ ఎలాంటి ప్రమాదంసంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సముద్రంలో అలల తాకిడి చాలా ఎక్కువగా ఉంది. ఒక్కోచోట సముద్రం రంగు మారిపోయి, అల్లకల్లోలంగా మారింది. కెరటాల ధాటికి బోట్లు కొట్టుకుపోకుండా మత్స్యకారులు వాటిని తీరం నుంచి కొద్ది దూరంగా తరలించడానికి నానా యాతన పడ్డారు. జీవీఎంసీ 18వ వార్డులోని అప్పుఘర్, వానిపాలెం, మూలపాలెం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ గొలగాని మంగవేణి పర్యటించి, దగ్గరుండి సహాయక చర్యలు చేయించారు. పారిశుధ్య పరిస్థితి మెరుగ్గా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పడిపోయిన చెట్లను వెంటవెంటనే తొలగించేలా అధికారులకు సూచించారు. సముద్ర అలలను చూసేందుకు నగరవాసులు సముద్ర తీరానికి వచ్చారు. సీతకొండ వ్యూ పాయింట్ వద్ద సందర్శకులు గట్టుపై కూర్చుని అలలను వీక్షించారు. కొండరాళ్లు పడుతున్నాయనే కారణంతో ఓ వైపు రహదారిని మూసివేసి, రాకపోకలను ఒకే దారిలోకి మళ్లించడంతో వాహనాలతో తీవ్ర రద్దీ ఏర్పడింది. పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళనతో వినియోగదారులు రైతు బజార్‌కు క్యూ కట్టారు. టమోటాలు నాలుగు కౌంటర్లు ఉన్నా, వాటి కొనుగోలుకు రద్దీ ఏర్పడింది.

బిక్కుబిక్కుమంటున్న కొండవాలు ప్రాంతవాసులు

- ఏ క్షణాన కొండ చరియలు విరిగి పడతాయోనని భయంభయం

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను కారణంగా 15వ వార్డులోని కొండవాలు ప్రాంత నివాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ సమయంలో కొండచర్యలు విరిగి ఇళ్లపై పడతాయోనన్న ఆందోళనతో ఉన్నారు.

నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో కొండచర్యలు విరిగి రాళ్ల ఇండపైకి చొచ్చుకొని వచ్చాయి. దుర్గానగర్ ప్రాంతంలో కొండచరియలు జారిపోవడంతో వర్షానికి మరింత మట్టి జారిపోకుండా తారపాతో స్థానికులు తాత్కాలిక రక్షణ ఏర్పాటు చేసుకున్నారు. హెచ్‌బీ కాలనీ, ఉమానగర్, డాక్టర్స్ కాలనీల్లో చెట్లకొమ్మలు విరిగి విద్యుత్ సరఫరాకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించాయి. విద్యుత్ శాఖ, జీవీఎంసీ యంత్రాంగాలు వెనువెంటనే స్పందించి వీటిని తొలగించారు.

ముంపు ప్రాంతాల్లో 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వెళ్లి బాధితులను సింహాద్రిపురం, దుర్గానగర్‌లలోని సామాజిక భవనాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను తరలించారు. తుపాను తగ్గిన వెంటనే ఇళ్లను నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చేలా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చి ధైర్యం చెప్పారు.

కొండ చిలువ కలకలం



ఆరిలోవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల గల క్రాంతినగర్‌లోని కాలువలో మంగళవారం ఉదయం కొండ చలువ స్థానికులకు కనిపించింది. దీంతో భయభ్రాంతులకు గురైన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ శాఖ సిబ్బంది వచ్చి కొండ చలువను పట్టుకోవడానికి ప్రయత్నం చేశారు. అది ఎంతసేపటికీ దొరకక పోవడంతో వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. కొండచలువ కాలవ వద్ద గల పెద్ద రంధ్రంలో దూరిపోయింది, ఇది చూసిన స్థానికులు కొందరు ధైర్యంతో కొండచలువ తోకను మెల్లగా పైకి లాగి దాన్ని అతి చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం దగ్గరలో గల కొండ ప్రాంతంలో విడిచి పెట్టారు. ఈ కొండ చిలువ 10 అడుగుల పొడవు ఉన్నది.

గోతిలో పడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు

- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టడమే కారణమంటున్న స్థానికులు


గోతిలో పడిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు

వెంకోజీపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీకాలనీ జంక్షన్‌లో హౌసింగ్ బోర్డు సంస్థ నిర్మిస్తున్న బహుళ అంతస్తుల దుకాణ సముదాయం కోసం తవ్విన గోతిలో మంగళవారం దీనికి ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు జారీ పడిపోయాయి. తమ గ్రామంలో వారికి ఇబ్బంది లేకుండా కొంత స్థలాన్ని విడిచిపెట్టి నిర్మాణం చేయమని శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం వారు ఇటీవల హౌసింగ్ బోర్డు సంస్థను అడిగారు. అయితే స్థలం విడవడం కుదరని హౌసింగ్ బోర్డు అధికారులు చెప్పడమే కాకుండా స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో కూడా గ్రామస్తులకు సర్దిచెప్పారు. దీంతో గ్రామస్థులు ఎటువంటి అభ్యంతరాలు తెలుపకుండా, నిర్మాణ గోతులను తవ్వుతున్నా పట్టించుకోలేదు. అయితే ఇక్కడ ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ప్రభుత్వ నిర్మాణానికే కనీస నియమాలు పాటించకుండా చేయడం ఈ అనర్థానికి దారి తీసిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థలానికి ఆనుకుని విద్యుత్ స్తంభాలు జారి పడేలా గోతులు తవ్వడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇది కేవలం హౌసింగ్ బోర్డు అధికారులు, నిర్మాణ కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేమని స్థానికులు మండి పడుతున్నారు. నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, గోతులు చివరి వరకు తవ్వేయడంతో మట్టి జారిపోయి విద్యుత్ స్థంబాలు, దానికున్న ట్రాన్స్‌పార్మర్ కూడా గోతిలో పడిపోయిందని, అంతేకాకుండా వీటితో పాటు మరో రెండు విద్యుత్ స్తంబాలు కూడా విరిగిపోవడం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

విషయం తెలిసినా వెంటనే విద్యుత్ శాఖాధికారులు లైన్ మెన్ వద్ద నుంచి ఎస్ఈ స్థాయి వరకూ అధికారులు ఇక్కడకు చేరుకుని సమస్యను పరిశీలించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఈ ప్రాంతానికి చేరుకొని, స్థానికులు, విద్యుత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ప్రత్యామ్నాయంగా తాత్కాలిక విద్యుత్ స్తంభాన్ని అమర్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నారు.

కాగా, ఇంత జరిగినా గృహ నిర్మాణ శాఖ అధికారులు మాత్రం కనిపించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కూలిన పాఠశాల గోడ.. తప్పిన పెను ప్రమాదం


నేలకొరిగిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సిరిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీబీఎం కాంపౌండ్, ఆశీల్‌మెట్ట పరిసర ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలిపోయాయి. అమర్‌నగర్‌లోని ఉమామహేశ్వర విజయ గణపతి ఆలయ సమీపంలో సోమవారం రాత్రి చెట్టు కూలి రహదారి అడ్డంగా పడింది. అక్కడ గల విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని ఆ లైన్లులో విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేశారు. శ్రీచైతన్య కాలేజీకి సమీపంలోని దారిలో భారీ వృక్షం నేలకొరిగింది. మంగళవారం జీవీఎంసీ సిబ్బందికి దానిని తొలగించి, ఆ దారిలో రాకపోకలను పునరుద్ధరించారు. టింపనీ స్కూల్ గేట్-ఏ వద్ద ప్రవారీ గోడ కూలిపోయింది. దీనికి సమీపంలోనే ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలం రక్షణ నిమిత్తం నిర్మించిన గోడ కూలింది. టింపనీ స్కూల్‌తో పాటు, సమీపంలో ఉండే ప్రైవేటు కాలేజీలకు ఇదే దారిలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. మంగళవారం స్కూళ్లు, కాలేజీలకు సెలవు కావటంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. భారీ వర్షాల నేపథ్యంలో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టం జరుగకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కాలనీల్లో కూలిన చెట్లను జీవీఎంసీ సిబ్బంది హుటాహుటిన తొలగించి ప్రజానీకంకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

సహాయక చర్యలకు ఇబ్బంది లేకుండా చూడండి : కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఇబ్బంది లేకుండా చూడాలని జీవీఎంసీ అధికారులకు కలెక్టర్ ఎం ఎన్ హరేంధిప్రసాద్ సూచించారు. జవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంగళవారం నగరంలో వరద పరిస్థితి, సహాయక చర్యలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులతో సమావేశమై వార్డు సచివాలయాల వారీగా సహాయక చర్యలు, కూలిపోయిన చెట్లు, స్తంభాలు, ప్రహరీలను తొలగించడం, రోడ్లపై వర్షంనీరు నిలిచిపోతే తొలగించే చర్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లోని వారికి మౌలిక వసతుల కల్పనపై పరిశీలించి, ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు.

చెట్లు పడి కార్లు ధ్వంసం


చెట్టుతో పాటు విద్యుత్ స్తంభం పడిపోగా ధ్వంసమైన కారు

మద్దిలపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ షిర్డీసాయి ఆలయం వద్ద మంగళవారం ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. పార్కింగ్ చేసిన కార్ల మీదా వృక్షాలు పడడంతో కార్లు ధ్వంసమయ్యాయి. ఓ కారు మీదా చెట్టుతో పాటు విద్యుత్ స్థంభం కూడా కూలిపోవడంతో పూర్తిగా డ్యామేజ్ అయింది. కాగా కాలువల నిర్మాణం పేరుతో నెల రోజుల కిందట పిఠాపురంకాలనీ రోడ్డును తవ్వేశారు. అపార్ట్‌మెంట్ ర్యాంప్‌లు కూడా తొలగించడంతో ఆయా నివాసులు తమ కార్లను రోడ్డు మీదా పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం వీచిన గాలులకు చెట్లు విరిగిపడడంతో తమ కార్లు ధ్వంసమయ్యాయని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో గత రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో మంగళవారం వీచిన పెనుగాలులకు లాసన్స్ బే కాలనీ పార్కులోని అనేక చెట్లు నేల కూలాయి. అధికారులు వెంటనే తొలగింపు చర్యలు తీసుకోవాలని లాసన్స్ బే కాలనీ బీచ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథ రామయ్య, సభ్యులు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజి** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 36, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 62, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్దచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 32, కంద 48, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

తుపాను ప్రభావంపై మేయర్, కమిషనర్ సమీక్ష


ఎమ్మెల్యేలు, జోనల్ కమిషనర్లతో మేయర్ వీడియో కాన్ఫరెన్స్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరద పరిస్థితిపై మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మంగళవారం వేర్వేరుగా సమీక్షించారు. కాకినాడ వద్ద తుఫాన్ తీరం దాటడంతో బుధవా రం తెల్లవారుజాము వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమతం చేయాలని మేయర్ ఆదేశించారు. అనంతరం తన చాంబర్‌లో నగర పరిధిలోని ఎమ్మెల్యేలు, జోనల్ కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరావాసకేంద్రాల్లోని వారికి ఆహారం, తాగునీటికి సమస్య లేకుండా చూడాలని జోనల్‌కమిషనర్లకు సూచించారు.

కుప్పకూలిన కొండవాలు మెట్ల మార్గం


కూలిన మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

ఆరిలోవ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డు బీసీ కాలనీ కొండపైకి వెళ్లే సీసీ రోడ్డు మొంథా తుపాను ధాటికి రోడ్డు కింద ఉన్న మట్టి కరిగిపోవడంతో కుప్పకూలింది. దీంతో కొండపైన నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు వెంటనే జీవీఎంసీ అధికారులతో చేరుకొని పరిశీలించారు. ఇసుక బస్తాలతో తాత్కాలిక మార్గా న్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్‌నతో మాట్లాడి ఇక్కడ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం తోటగరువు స్కూలులో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రానికి అక్కడి వారిని తరలించారు. ఎమ్మెల్యేతో పాటు జడ్సీ కనకమహాలక్ష్మి, తహసీల్దార్ పాల్‌కిరణ్, డీఈ వెంకటరావు, జీవీఎంసీ సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్టీల మధ్య ఫ్లెక్సీ చిచ్చు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్ష పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు కూటమికి చెందిన భారీ ఫ్లెక్సీని చించేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పెదవాల్తేరుకు చెందిన కొందరు తెలుగుదేశం నాయకులు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెదవాల్తేరు గాంధీ సెంటరు వద్ద తెలుగు యువత ఆధ్వర్యంలో దీపావళికి ముందు 18 అడుగుల భారీ ఫ్లెక్సీ పెట్టారు. ఇందులో ప్రధాని మోదీతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌ల ఫొటోలు ఉన్నాయి. 27వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఐదుగురు వ్యక్తులు ఈ ఫ్లెక్సీని చించేసి, తగులబెట్టారని తెలుగు యువత నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుకు సీసీ కెమెరా ఫుటేజీని కూడా జత చేశారు. ఫిర్యాదుపై పోలీసులు ఏ విషయమూ ధ్రువీకరించలేదు. కాగా, ఫ్లెక్సీ చింపినట్టు సీసీ ఫుటేజీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

163.6 అడుగులకు చేరిన ముడసర్లోవ నీటిమట్టం



ఆరిలోవ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు ముడసర్లోవ జలాశయం ఆరు అడుగు మేర పెరిగింది. వర్షాలకు ముందు దీని నీటి మట్టం 157.5 అడుగులు ఉండగా, మంగళవారం సాయంత్రానికి 163.6 అడుగుల మేర నీరు చేరినట్టు అధికారులు వెల్లడించారు. దీని పూర్తి స్థాయి నీటి మట్టం 170 అడుగులు అని తెలిపారు.

హోర్డింగుల తొలగింపులో వివక్ష

వాణిజ్య ప్రకటనలకు మినహాయింపు


సంపత్ వినాయగర్ ఆలయం సమీపంలో తొలగించని హోర్డింగులు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ గాలులు తీవ్రంగా ఉంటాయన్న హెచ్చరికల నేపథ్యంలో నగరంలో భారీ హోర్డింగ్‌లను తొలగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీనిని క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు చేయలేదు. హోర్డింగ్‌లు గాలులకు కింద పడి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా తొలగించాలని సిబ్బంది సూచించారు. వారే కేవలం రాజకీయ నాయకుల హోర్డింగ్‌లు తొలగించి, వాణిజ్య ప్రకటనల హోర్డింగ్‌లను వదిలేశారు. వాటికి ఒప్పందం జరిగిందని, తొలగిస్తే డబ్బులు వెనక్కి ఇవ్వాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రజల ప్రాణాల కన్నా వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయమే ఎక్కువా? అని అంతా నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్


మాధవధార వాంబేకాలనీలో పరిస్థితిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తదితరులు

విశాఖపట్నం/మాధవధార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. కైలాసపురం, శాంతినగర్, కస్తూరినగర్, మాధవధార, అంబేడ్కర్ కాలనీల్లో పర్యటించిన ఆయన పరిస్థితులను సమీక్షించి అధికారులు, ప్రజలను అప్రమత్తం చేశారు. కొండచరియలు విరిగిన ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో కొండవాలు ప్రాంతాల్లో ఉండడం ప్రమాదకరమని, ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ సిబ్బంది ఎలాంటి సహాయమైనా అందిస్తారన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని, పరిస్థితులు మారే వరకు అక్కడ తలదాచుకోవాలన్నారు. మాధవధార అంబేడ్కర్ కాలనీలోని వాంబే గృహ సముదాయంలో పాక్షికంగా దెబ్బతిన్న గోడను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. ప్రమాదకర స్థితిలో ఉన్న ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఆయన వెంట జోనల్ ప్రత్యేక అధికారి మాధవి, రెవెన్యూ, ఇతర అధికారులున్నారు.

సహాయక చర్యలు ముమ్మరం

జ్ఞానాపురం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో తుఫాన్ సహాయక చర్యలు ముమ్మరం చేశారు. జోన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్న ముంపు ప్రాంత ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. జోనల్ కమిషనర్ బి.రాము ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ, ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. జ్ఞానాపురం జేఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి 55 మందిని తరలించారు. జ్ఞానాపురంలోని ఎర్రిగెడ్డలో పూడిక తొలగింపు పనులను, ఆర్అండ్‌బీ యార్డును మంగళవారం రాత్రి దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ పరిశీలించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు ఐతి రవిబాబు తదితరులు ఉన్నారు. జ్ఞానాపురంలోని స్వచ్ఛంద సంస్థ అవర్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పిల్లి గోవిందరాజు, చుక్కా శ్యామ్‌సుందర్, కిలాడి జీవన్‌లు రైల్వేస్టేషన్, కాన్వెంటుకూడలి, జ్ఞానాపురం ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆహారం అందజేశారు.

కూలిన చెట్ల తొలగింపు

మహారాణిపేట: తుఫాన్ గాలుల కారణంగా పలుచోట్ల చెట్లు కూలాయి. కలెక్టరేట్ లోపల ఓ చెట్టు వేళ్లతో బయటకు రావడంతో అక్కడ ఉన్న వైపరీత్యాల యాజమాన్య బృందం (డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్) ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి చెట్టును తొలగించింది. వన్‌టౌన్ కోటవీధి ప్రాంతంలో పెద్ద చెట్టు కూలటంతో దానిని సైతం స్థానికుల సాయంతో జీవీఎంసీ సిబ్బంది తొలగించారు.

సీతమ్మధార: సీతమ్మధారలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి, కొమ్మలు పడిపోయాయి. కాలువలు, గెడ్డలు వ్యర్థాలతో పొంగిపొర్లాయి. జోనల్ కమిషనర్ శివప్రసాద్ పర్యవేక్షణలో సహాయ వైద్యాధికారి బి.ప్రసాదరావు, పారిశుధ్య పర్యవేక్షకుడు సత్యనారాయణ, సిబ్బందితో కలిసి రహదారికి అడ్డంగా పడిన చెట్ల కొమ్మలను, పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

అక్కయ్యపాలెంలో కూలిన కల్వర్టు

అక్కయ్యపాలెం: ప్రధాన రహదారిలోని వేణుగోపాలస్వామి ఆలయం పక్కన ఉన్న కల్వర్టు మంగళవారం కూలిపోయింది. దీన్ని 25 ఏళ్లక్రితం నిర్మించడంతో శిథిల స్థితికి చేరింది. కొన్నేళ్ల క్రితం దీనికి బీటలు వారినా పట్టించుకోకపోవడంతో ప్రస్తుత వర్షాలకు కల్వర్టు నానిపోయి నేలకొరిగింది. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కుంగిన జాతీయ రహదారి

సీతంపేట: తుఫాన్ వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. జాతీయ రహదారి సత్యం కూడలి నుంచి గురుద్వార కూడలికి వెళ్లే రహదారిలో రోడ్డు కుంగిపోయింది. ఆ ప్రాంతం కింద పెద్ద గెడ్డ ఉంది. అందులో నిత్యం పెద్ద ఎత్తున నీరు పారుతుంది. అయిదో జాతీయ రహదారి మధ్యలో కాకుండా, పక్కకు కుంగిపోవడంతో ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ఆ రహదారి గుండా రాకపోకలకు ఇబ్బందులు కలగలేదు.



గురుద్వార కూడలి గెడ్డ వద్ద కుంగిపోయిన జాతీయ రహదారి


ఆర్ అండ్‌బీ యార్డును పరిశీలిస్తున్న సీతంరాజు సుధాకర్ తదితరులు


కలెక్టరేట్‌లో తొలగిస్తున్న చెట్టు


సీతమ్మధారలో కూలిన చెట్టును కోస్తున్న సిబ్బంది

కలెక్టరేట్‌లోనే కలెక్టర్ బస

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తీవ్రతుఫాన్ మంగళవారం రాత్రి తీరం దాటే క్రమంలో అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోనే బసచేశారు. తన చాంబర్, తుఫాన్ కంట్రోల్‌రూమ్ నుంచి పరిస్థితి సమీక్షించారు. ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలన్నారు. తుఫాన్ తీరందాటే వరకు, ఆ తరువాత జిల్లాలో వర్షాలు, గాలుల ప్రభావం ఉంటుందని, దీంతో అధికారులు బుధవారం ఉదయం వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్నివిభాగాల అధికారులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మంగళవారం సాయంత్రం మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌ను సందర్శించారు.

తొలగని ముప్పు

... 5వ పేజీ తరువాయి

నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పద్మనాభంలో 5.3, అక్కిరెడ్డిపాలెం, గోస్తనీ పంపుహౌస్‌లో 5.2, వేపగుంటలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2018 సంవత్సరం (తితిలీ తుఫాన్ సమయాన) తరువాత మరోసారి విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం ఓడరేవుల్లో తొమ్మిదో నంబరు డేంజర్ సిగ్నల్స్ ఎగురవేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

తుఫాన్ నేపథ్యంలో వందే భారత్‌కు దువ్వాడలో హాల్ట్

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో విశాఖ మీదుగా విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, బెంగళూరు వైపు రైళ్లు సుమారు 60 వరకు మంగళవారం రద్దు చేశారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే వందేభారత్ రైళ్లను మాత్రమే నడిపారు. ఈ రైలు మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో 5.05 గంటలకు బయలుదేరింది. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం చేరాల్సి ఉంది. ప్రయాణికుల్లో చాలా మంది అనకాపల్లి, స్టీల్‌ప్లాంటు, ఫార్మాసిటీ ప్రాంతాలకు చెందిన వారున్నారు. వందేభారత్ రైలు అన్ని స్టేషన్లలో ఆగదు. చాలా తక్కువ స్టాపులు. సామర్లకోట స్టాప్ తరువాత నేరుగా వచ్చి విశాఖపట్నంలోనే ఆగుతుంది. అయితే వర్షాలు అధికంగా కురుస్తున్న తరుణంలో తామంతా విశాఖ వెళ్లి అక్కడి నుంచి కార్లు, ఆటోలు పట్టుకొని దువ్వాడ, అనకాపల్లి తదితర ప్రాంతాలకు వెనక్కి రావాలంటే ఇబ్బంది అవుతుందని, తుఫాన్ నేపథ్యంలో అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఈ రైలును ఆపాలని ప్రయాణికుల్లో కొందరు రైల్వే యాప్‌లో రిక్వెస్ట్ చేశారు. మరికొందరు అనకాపల్లి ఎంపీకి, విశాఖ ఎంపీకి సమాచారం ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి' కూడా తన వంతు ప్రయత్నంగా వాల్తేరు డీఆర్ఎంకు ప్రయాణికుల విన్నపాన్ని చేరవేసింది. హైదరాబాద్ నుంచి అనకాపల్లి వరకు దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి. అక్కడి అధికారులు విన్నపాన్ని పట్టించుకోలేదు. వాల్తేరు డివిజన్ అధికారులు మాత్రం ఈస్ట్ కోస్ట్ జోన్ అధికారులతో సంప్రతించి దువ్వాడలో రైలు ఆపడానికి అనుమతి తీసుకున్నారు. ఇదే విషయాన్ని రైలులోని మైకులో ప్రయాణికులకు వినిపించారు. దాంతో చాలా మంది ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు దువ్వాడలో రైలు ఆగగానే సుమారు 100 మంది వరకు అక్కడ దిగారు. తమ విన్నపాన్ని మన్నించినందుకు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వందే భారత్ ఇలా హాల్ట్ లేని స్టేషన్‌లో ఆగడం డివిజన్‌లో ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్ వెలవెల

... 5వ పేజీ తరువాయి

దురంతో (22203), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్(12739), విశాఖ-నాందేడ్ సూపర్‌ఫాస్ట్ (20811), విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), విశాఖ-మచిలీపట్నం (17220), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), విశాఖ-రాజమండ్రి (67286), విశాఖ-కాకినాడ పోర్టు (17268), విశాఖ-గుంటూరు (22875) వంటి విశాఖ ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ మీదుగా నడిచే భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244) రైళ్లను మంగళవారం రద్దు చేశారు.

అదనపు కౌంటర్ల ద్వారా టికెట్ల సొమ్ము వాపసు

రద్దు చేసిన రైళ్లకు సంబంధించిన రిజర్వేషన్ టికెట్ల సొమ్మును ప్రయాణికులకు యుద్ధప్రాతిపదిన వాపసు చేశారు. రిజర్వేషన్ కేంద్రాలలో టికెట్ పొందిన వారు వాల్తేరు రైల్వే అధికారులు ఏర్పాటుచేసిన అదనపు కౌంటర్ల ద్వారా నిమషాలలోనే సొమ్ము వాపసు తీసుకున్నారు.

రైళ్ల రీ షెడ్యూల్

తుఫాన్ ముందస్తు జాగ్రత్తలో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన కోరమండల్, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు పలు రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. వీటిలో షాలిమార్-చర్లపల్లి ఈస్ట్‌కోస్ట్ (18045), షాలిమార్-చెన్నై ఎగ్మోర్ (22825), హౌరా-బెంగళూరు (22887), హౌరా-చెన్నై సెంట్రల్ కోరమండల్ (12841), సంత్రాగచ్చి-చెన్నై (22807), షాలిమార్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (22853) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి 12 గంటల ఆలస్యంగా బయలుదేరాయి. ఇక బిలాస్‌పూర్-తిరుపతి (17481), ధన్‌బాద్-అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ (13351) రైళ్లు ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి ఏడు గంటలు ఆలస్యంగా బయలుదేరేలా రీ షెడ్యూల్ చేశారు. భువనేశ్వర్-పుణే ఎక్స్‌ప్రెస్ (22882) రెండున్నర గంటలు, అగర్తాల-బెంగళూరు హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (12504) గంటన్నర, ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18190) తొంభై నిమషాలు ఆలస్యంగా బయలుదేరాయి.

నేడు, రేపు పలు రైళ్లు రద్దు

బుధవారం విశాఖ-మచిలీపట్నం (17220), రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17244), భువనేశ్వర్-హైదరాబాద్ ప్రత్యేక రైలు (07166) రద్దు కాగా, గురువారం (30న) లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520), ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17479) రైళ్లను రద్దు చేశారు.

మొంథా ముసురు

... 5వ పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు.

నానిపోయి పడిపోయిన గోడలు

నగరంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బలహీనంగా ఉన్న ప్రహరీ గోడలు నానిపోయి మంగళవారం పలు ప్రాంతాల్లో కూలిపోయాయి. టింపనీ స్కూల్ ప్రహరీ ఒకవైపు కూలిపోగా, అదే ప్రాంతంలో ఖాళీ స్థలం చుట్టూ నిర్మించిన గోడ పడిపోయింది. కేజీహెచ్ గోడ రెల్లివీధి వైపు కూలిపోయింది. కొండవాలు ప్రాంతాల్లో చాలాచోట్ల ఇళ్ల వెనుక నిర్మించుకున్న గోడలు పడిపోయాయి. ఇలా మొత్తం ఎనిమిదిచోట్ల గోడలు పడిపోయినట్టు అధికారుల దృష్టికి వచ్చింది. బీచ్‌రోడ్డులో సీతకొండ వద్ద బండరాళ్లు జారి పడడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వెళ్లి పరిశీలించారు. ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. ఆర్‌కే బీచ్ నుంచి రుషికొండ వరకూ బీచ్‌లలోకి ఎవరూ వెళ్లకుండా 18 మంది లైఫ్ గార్డులను పెట్టారు. అయితే వారెవరికీ కనీసం రెయిన్ కోట్లు కూడా సమకూర్చలేదు. వర్షంలో తడుస్తూనే విధులు నిర్వహించారు.

రైల్వేస్టేషన్ ఎదుట నిలిచిన నీటి సరఫరా

నగరంలో చాలాచోట్ల వరద నీరు రహదారులపై నిలిచిపోయింది. రైల్వేస్టేషన్ ఎదురుగా కార్నర్‌లో నీరు ప్రవహించే మార్గాలు మూసుకుపోవడంతో రెండు అడుగుల ఎత్తున నీరు నిలిచిపోయింది. జీవీఎంసీ అధికారులు సిబ్బందిని రంగంలోకి దించి పనులు చేపట్టారు. వెలంపేట, కేఆర్ఎం కాలనీ, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, చావులమదుం తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఇలా 30 ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోగా 20 చోట్ల అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు నిండిపోయి మ్యాన్‌హోళ్లు పైకి లేచిపోయి మురుగు రోడ్లపైకి వచ్చింది. ఇలా సుమారుగా 20 చోట్ల మ్యాన్‌హోళ్ల మూతలు పైకి లేచాయి. వాటిలో పదింటిని సరిచేశారు. ఇంకా మరికొన్ని పనులు చేపట్టాల్సి ఉంది.

మల్కాపురం-సింధియా మార్గంలో నిలిచిన రాకపోకలు

మల్కాపురం-సింధియా మార్గంలో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి డివైడర్ కనిపించకుండా పోయింది. సుమారు రెండు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. నీరు పక్కనున్న ఏకేసీ కాలనీలోకి ప్రవేశించింది. సుమారు 400 కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ దగ్గరుండి పనులు చేయించారు.

ఆర్టీసీపై తుఫాన్ ప్రభావం

... 5వ పేజీ తరువాయి

మంగళవారం 200 సర్వీసులను రద్దు చేశారు. హైదరాబాద్‌కు ఎనిమిది బస్సులు వెళ్లాల్సి ఉండగా మూడు మాత్రమే నడిపారు. విజయవాడకు గంటకు బస్సు నడపాల్సి ఉండగా మూడు గంటలకు ఒక సర్వీస్ ఆపరేట్ చేశారు. తిరుపతి, బెంగళూరు, చెన్నై, గుణుపూర్, నవరంగపూర్, భువనేశ్వర్ సర్వీసులు రద్దు చేశారు. కాకినాడ, రాజమండ్రిలకు 40 నిమిషాల వ్యవధిలో షెడ్యూల్ సర్వీసులు ఉండగా రెండు గంటల ఫ్రీక్వెన్సీతో నడిపారు. శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాలకు ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు నడిచేది. వీటిని గంటకు ఒకటి చొప్పున నడిపారు. ముందుగా సీట్లు రిజర్వు చేసుకున్న వారు టికెట్లు రద్దు చేసుకోవడంతో ప్రయాణికుల సంఖ్య మరింత తగ్గింది. దీంతో సగటు ఆక్యుపెన్సీ రేషియో 50 శాతానికి పడిపోయింది. ద్వారకా నగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రయాణికులు లేక వెలవెలబోయింది. తుఫాన్‌కు ముందు రోజూ 740 సర్వీసులు 85 నుంచి 90 శాతం సగటు ఓఆర్‌తో నడిచేవి. మంగళవారం 540 బస్సులు నడపగా, 50 శాతం మాత్రమే ఓఆర్ నమోదయింది. రెండేళ్లలో ఇదే తక్కువని అధికారులు తెలిపారు. కాగా సాయంత్రం నుంచి బస్సులన్నీ ఖాళీ అయ్యాయి. దీంతో రాత్రి తొమ్మిది గంటలకే సంబంధిత డిపోలకు చేర్చాలని అధికారులు నిర్ణయించారు.

24/7 వార్ రూమ్

... 5వ పేజీ తరువాయి

చర్యలు, మెటీరియల్ సరఫరా కోసం ప్రత్యేక రైళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. అదేవిధంగా రాయగడ-విజయనగరం, దువ్వాడ-విశాఖపట్నం-పలాస సెక్షన్‌లో సైతం తగిన జాగ్రత్తలు చేపట్టామన్నారు. రైల్వే బ్రిడ్జిలు, ట్రాకులు, యార్డులు, సిగ్నల్ పాయింట్ల వద్ద పెట్రోలింగ్‌తో పాటు వాచ్‌మెన్లను కూడా నియమించామన్నారు. ఎక్కడ ఏమి జరిగినా తక్షణమే సమాచారం వచ్చేలా, తగిన సహాయం అందేలా చూస్తున్నామన్నారు.

మరో 12 గంటలు కీలకం

... 5వ పేజీ తరువాయి

వెల్లడించారు. మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు 1.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. జీవీఎంసీ పరిధిలో జోన్‌కు రెండు చొప్పున క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను అందుబాటులో ఉంచామన్నారు. ఎప్పటికప్పుడు చెట్ల కొమ్మలను, డ్రెయిన్లలో పూడికను తొలగిస్తున్నామని వివరించారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రజలను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ములగాడ, సీతకొండ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయని, ఇతర చోట్ల రాళ్లు జారాయన్నారు. ప్రజలు ఏదైనా అత్యవసరమైతే హెల్ప్‌లైన్ నంబర్లు 0891-2590100, 96669 09192, 180042500009కు సంప్రతించాలన్నారు.

సరదాలకు సమయం కాదు: ఎంపీ శ్రీ భరత్

ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ కొందరు బీచ్‌లో సెల్ఫీలు తీసుకుంటున్నారని, దయచేసి అలా చేయవద్దని హితవు పలికారు. సరదాలకు ఇది సమయం కాదన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించానని, అధికారులు, సిబ్బంది పక్కాగా చర్యలు చేపట్టారన్నారు.

సమీక్షించిన మంత్రి

మంగళవారం రాత్రి జిల్లా అధికారులతో ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మరో 24 గంటలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

తక్షణ సహాయ చర్యలకు ఎమ్మెల్యే విష్ణు ఆదేశం

సీతమ్మధార, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పడిపోయిన చెట్లను రహదారులకు అడ్డంగా లేకుండా తొలగించడం, కుంగిన రహదారిలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టడం, ఎవరైనా వర్షంలో చిక్కుకున్నా, కొండవాలు ప్రాంతాల్లో ప్రమాదంలో ఉన్నా వారికి రక్షణ కల్పించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు, పోలీసులకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సూచించారు. ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అధికారులు, కార్పొరేటర్లతో కలిసి మంగళవారం ఆయన పర్యటించి తుఫాన్ ప్రభావాన్ని పరిశీలించారు. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడడం, కొండవాలు ప్రాంతంలో రాళ్లు జారిపడడం, మాధవధార వాంబే కాలనీలో ఇళ్లు పెచ్చులూడిపోవడం వంటి ఘటనలు ఆయన దృష్టికి వచ్చాయి. ఆయా ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల భద్రతే ముఖ్యమని, ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని సహాయక చర్యలు తక్షణమే చేపడతామన్నారు. గురుద్వార కూడలి సమీపంలో జాతీయ రహదారి కుంగిపోవడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్టాపర్స్ ఏర్పాటు చేసి వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టాలని పోలీసులు, ట్రాఫిక్ అధికారులకు సూచించారు. డిప్యూటీ కలెక్టర్ మాధురి, స్థానిక కార్పొరేటర్లు సారిపిల్లి గోవింద్, ఆర్.వెంకటరమణ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, బీజేపీ ఇంచార్జ్ సురేష్‌బాబు, జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన

అక్కయ్యపాలెం: ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. కస్తూరినగర్ తదితర ప్రాంతాలను సందర్శించారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, టీడీపీ నాయకుడు నజీర్ తదితరులు పాల్గొన్నారు. 45వ వార్డులోని కొండ ప్రాంతాలను కార్పొరేటర్ కంపా హనోక్ సందర్శించారు. సంతోషి మాత కాలనీ, సోనియా గాంధీనగర్‌లోని గెడ్డలో చెత్త పేరుకుపోవడం వల్ల నీరు పారడం లేదని, తాటిచెట్లపాలెం ప్రధాన కూడలిలో గెడ్డ పొంగి రోడ్డుమీదకు ప్రవహిస్తుందని తెలుసుకున్న ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సింహగిరి కాలనీ, గణేష్‌నగర్‌లోని హైమాస్ట్ స్తంభాలు విరిగిపోవడంతో కొత్తవి వేయించాలని అధికారులను కోరారు.


సింహగిరి కాలనీలో హైమాస్ట్ దీపస్తంభాన్ని తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

తప్పిన ప్రమాదం

అల్లిపురం: కొబ్బరితోట ప్రాంతం యాతపేట సచివాలయ పరిధిలో వర్షాలకు ఇంటి బాల్కనీ కూలిపోయింది. కానీ ఆ సమయంలో అటుగా ఎవ్వరూ వెళ్లకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

పునరావాస కేంద్రాలకు 138 మంది తరలింపు

▸▸ ఎనిమిదిచోట్ల కూలిపోయిన ప్రహరీలు ▸▸ నేలకూలిన 134 చెట్లు


అక్కయ్యపాలెం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కూలిన కల్వర్టు

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లోని వారిని జీవీఎంసీ పునరావాస కేంద్రాలకు తరలించారు. తుఫాన్ నేపథ్యంలో 79 చోట్ల పునరావాస కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. మంగళవారం భారీ వర్షాలు కురవడంతో 138 మందిని 13 పునరావాస కేంద్రాలకు తరలించారు. నగర పరిధిలో 134 చెట్లు కూలిపోయాయి. సీతమ్మధార వసంతబాల ఉన్నత పాఠశాల సమీపంలో చెట్టుపడిపోవడంతో కారు ధ్వంసమయింది. 111 కూలిన చెట్లను జీవీఎంసీ హార్టికల్చర్, ప్రజారోగ్య విభాగం సిబ్బంది తొలగించారు. పది చోట్ల విద్యుత్ స్తంభాలు, ఐదుచోట్ల ప్రహరీ కూలిపోయాయి. వన్‌టౌన్‌లోని ఏవీఎన్‌కాలేజీ డౌన్‌లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రహరీ కూలిపోవడంతో పార్కింగ్‌చేసిన ఆటో ధ్వంసమైంది. సీబీఎం కాంపౌండ్ టింపనీ పాఠశాల ప్రహరీతోపాటు ఎదురుగా ఉన్న అపార్టుమెంట్ ప్రహరీ , ఆరిలోవ క్రాంతినగర్‌లో రెండు ఇళ్ల ప్రహరీలు కూలిపోయాయి. బీచ్‌రోడ్డులో సీతకొండ వద్ద కొండచరియలు జారి రోడ్డుపైకి దొర్లాయి. నగరంలో వరదనీరు యూజీడీల్లో కలిసిపోవడంతో 21 చోట్ల పైప్‌లైన్ జామ్ అయి మ్యాన్‌హోల్‌పై కప్పులు తెరుచుకుని మురుగు రోడ్డుపైకి వచ్చింది. 15 చోట్ల సిబ్బంది సమస్యను పరిష్కరించారు. 28 చోట్ల వరద నీరు నిలిచిపోయింది. మల్కాపురం పోలీస్‌స్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ఏకలవ్యకాలనీ నీటమునిగింది. అక్కడి వందకుపైగా కుటుంబాలను సమీపంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. వన్‌టౌన్‌లోని ఎర్రిగెడ్డ పొంగిపోవడంతో వర్షంనీరు సముద్రంలోకి వెళ్లడానికి అవకాశం లేక రామకృష్ణథియేటర్ పరిసర ప్రాంతాలను ముంచెత్తడంతో రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షంనీరు చేరిపోవడంతో నివాసితులు బయటకు తోడుకోవాల్సి వచ్చింది. వరదల కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని 202 మంది జీవీఎంసీ కంట్రోల్‌రూమ్‌లకు ఫిర్యాదుచేయగా 164 ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించారు.

మట్టి పెళ్లలు పడి రెండిళ్లకు నష్టం

కంచరపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి ఇందిరానగర్-3లో తుఫాన్ ప్రభావంతో మట్టిపెళ్లలు రెండిళ్లపై పడడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. పితాని అంజమ్మ, సూరిబాబు కొండను ఆనుకుని నివాసం ఉంటున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మట్టి పెళ్లలు నానిపోయి మంగళవారం ఇంటి శ్లాబులపై ఆకస్మికంగా పడిపోయాయి. దీంతో ఇంట్లో ఉంటున్న వారు పరుగున బయటకు వచ్చేయడంతో ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. విషయాన్ని తెలుసుకున్న టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి గురే జయశ్రీ, సీనియర్ నాయకుడు సత్యాడ అప్పారావు, ఆర్.మహేష్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. వీఆర్వో చందు, పోలీస్, సచివాలయ సిబ్బంది సందర్శించి జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జీవీఎంసీ 55వ వార్డు పరిధి మురికివాడలైన గాంధీనగర్, బ్రిడ్జి దిగువ ప్రాంతాల్లో వార్డు టీడీపీ నాయకులు మంగళవారం పర్యటించి అప్రమత్తం చేశారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజీత్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ ఎన్.అప్పారావు, ప్రధాన కార్యదర్శి రమణ అప్పారావు, ఇతర సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా రంజీత్ మాట్లాడుతూ విశాఖ ఎంపీ శ్రీభరత్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుల ఆదేశాల మేరకు మురికివాడల్లో పూరి గుడిసెలు, పాకల్లో నివాసం ఉంటున్న పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు.


మట్టిపెళ్లలు పడిన ఇంటిని పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

అత్యవసరమైతేనే బయటకు రండి


పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో దక్షిణ నియోజకవర్గంలోని ప్రజలందరూ సురక్షితంగా ఉండేలా అధికారులు, కూటమి నాయకులు సేవలందించాలని ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ కోరారు. మంగళవారం 31వ వార్డులోని ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల్లోని సమస్యలను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు మొంథా తుఫాన్ తీవ్రతను తెలియజేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయటకు రావద్దని సూచించారు. అనవసర ప్రయాణాలు చేయవద్దని, ముఖ్యంగా చెట్లు, హోర్డింగ్‌ల వద్ద ఉండొద్దని కోరారు. జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఎమ్మార్వో పాత్రుడు, ఇతర అధికారులతో ఆయా సమస్యలను తెలియజేశారు. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటాన్ని గమనించి తక్షణమే తొలగించాలని ఆదేశించారు. గెడ్డలను, కాలువలను పరిశీలించారు.

ఎర్రమట్టి దిబ్బల్లో జియో హెరిటేజ్ స్థలం గుర్తించేందుకు కమిటీ

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమునిపట్నం మండలం నేరెళ్లవలసలోని సర్వే నంబరు 118/5ఏ (పాత సర్వే నంబరు 49/1)లో జియో హెరిటేజ్ స్థలం గుర్తించి, దానికి సరిహద్దులు నిర్ణయించి, కాంక్రీట్ స్తంభాలు వేయాలంటూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. జియో హెరిటేజ్ స్థలంలో తవ్వకాలు జరుపుతున్నారని, లేఅవుట్లు వేస్తున్నారని పలువురు హైకోర్టులో ప్రజా ప్రయోజనం వ్యాజ్యం వేయడంతో కోర్టు ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ ఈ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి ఒక కమిటీని ఏర్పాటుచేయాలని సూచించింది. వీఎంఆర్‌డీఏ నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సర్వే సెటిల్‌మెంట్ విభాగం (రెవెన్యూ) నుంచి ఆర్‌డీఓ, గనుల శాఖ నుంచి డిప్యూటీ డైరెక్టర్, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి డైరక్టర్ పి.దుర్గాప్రసాద్, సీనియర్ జియాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ దొరడ్లతో కమిటీ వేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. గుర్తించిన స్థలం చుట్టూ కాంక్రీట్ పిల్లర్లు నిర్మించిన తరువాత కమిటీ అక్కడకు వెళ్లి అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాలని పేర్కొన్నారు.

వాహనాల రాకపోకలపై ఆంక్షలు

... 5వ పేజీ తరువాయి

భారీవాహనాలు వెళితే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం వుంటుంది కాబట్టి ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి నగరంలోకి వచ్చే భారీవాహనాలను జాతీయ రహదారి వెంబడి ఉన్న హోల్డింగ్ పాయింట్ల వద్ద నిలిపేస్తామని సీపీ తెలిపారు.


భారీ వర్షాల కారణంగా నీట మునిగిన మల్కాపురం-సింధియా ప్రధాన రహదారిలో నిలిచిపోయిన కారు


యారాడ ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది


గాలుల తీవ్రతకు గోపాలపట్నం పూడా కాలనీలోని పార్కులో చిన్నారుల క్రీడా పరికరాలపై పడిన చెట్టు


పారిశ్రామిక ప్రాంతం త్రినాథపురంలో మట్టిపెళ్లలు పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తుఫాన్ బీభత్సం

» భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం » మునిగిన మల్కాపురం-సింధియా రోడ్డు » నేలకూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
» పొంగిపొర్లుతున్న గెడ్డలు, వాగులు » 'మేహాద్రిగెడ్డ' నీటి విడుదలతో ముంపులో కొత్తపాలెం శివారు ప్రాంత కాలనీలు
» కొండవాలు ప్రాంతాల్లో పలుచోట్ల జారిపడిన మట్టిపెళ్లలు » యారాడ ఘాట్ రోడ్డులో విరిగిపడిన కొండచరియలు


వర్షాల ధాటికి జుత్తాడ మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు


గాజువాక కృష్ణానగర్ కొండపై నుంచి విరిగిపడిన మట్టిపెళ్లలు


40వ వార్డు పరిధిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువుపై గట్టు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


మల్కాపురం-సింధియా రోడ్డులో ద్విచక్ర వాహనదారులు పాట్లు

మొంథా తుఫాన్ తీవ్ర బీభత్సం సృష్టించింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొన్నిచోట్ల రహదారులు చెరువులను తలపించడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నానాపాట్లు పడ్డారు. గాలుల తీవ్రతకు కొన్నిచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. గెడ్డలు , వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మొంథా పెను తుఫాన్‌గా మారినందున వర్ష తీవ్రత మరింత అధికమయ్యే అవకాశం ఉండడంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

మల్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మంగళవారం సింధియా నుంచి మల్కాపురం వెళ్లే ప్రధాన మార్గంలో గల పోలీస్ స్టేషన్ నుంచి నౌసేనాబాగ్ వరకు రెండు వైపులా రోడ్డు పూర్తిగా వర్షపు నీటితో నిండిపోవడంతో చెరువును తలపిస్తోంది. ఇక్కడి డివైడర్‌ను మించి రోడ్డుతో నిండిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో సుమారు మూడు గంటల పాటు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పలు ద్విచక్ర వాహనాలు నీట మునిగాయి. ఒక కారు ఇంజన్‌లోకి నీరు చేరి ఆగిపోవడంతో పలువురు యువకులు దానిని తోసుకుంటూ ముందుకు సాగారు. ఓ ఆర్టీసీ బస్సు కూడా నీట మునిగిపోయే పరిస్థితి నెలకొంది. కాగా కొండవాలు ప్రాంతాల్లో సీపీఎం నాయకులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. పలుచోట్ల మట్టిపెళ్లలు పడిపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే గణబాబు, కమిషనర్ పర్యటన

మల్కాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డు నీట మునిగినందున సమీపంలోని ఏకేసీ కాలనీలోకి వరద ముంపు ప్రమాదం ఉందన్న సమాచారం అందుకున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు ఉదయం 7 గంటలకే ఇక్కడకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఆయన వెంట జోన్-5 కమిషనర్ రాము ఉన్నారు. వర్షపు నీరు సజావుగా పారేందుకు వీలుగా యుద్ధప్రాతిపదికన గెడ్డల్లో పేరుకుపోయిన పూడికను తీయించడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. ఈలోగా జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఇక్కడకు వచ్చి ఎమ్మెల్యేతో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వార్డుల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు

గ్రేటర్ 40వ వార్డులో పునరావాస కేంద్రంగా ఏకేసీ కాలనీలోని సామాజిక భవనం మొదటి అంతస్థును, 61వ వార్డు మల్కాపురానికి సంబంధించి మరిడిమాంబ కల్యాణ మండపాన్ని, 58వ వార్డుకు సంబంధించి ఎదురువానిపాలెం, గొందేశివానిపాలెం, శ్రీరామ్‌నగర్‌ల్లో గల సామాజిక భవనాలను పునరావాస కేంద్రాలుగా కేటాయించారు. అలాగే 60వ వార్డుకు సంబంధించి హనుమాన్ సంజీవ్ కాలనీలోని సామాజిక భవనాన్ని, 59వ వార్డుకు హిమాచల్‌నగర్, మాజీ సైనికుల కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీల్లో గల సామాజిక భవనాలను, 62వ వార్డుకు దుర్గానగర్, త్రినాథపురంలో గల సామాజిక భవనాలను, 63వ వార్డుకు జైఆంధ్ర కాలనీలోని సామాజిక భవనాన్ని పునరావాస కేంద్రాలుగా కేటాయించారు.

యారాడ తీరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే పల్లా

యారాడ తీర ప్రాంతంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, పలువురు అధికారులు పర్యటించారు. సముద్ర అలలు తీవ్రత ఉధృతంగా ఉన్నందున ఎవరూ తీరం వైపు రావొద్దని సూచంచారు. ప్రజలందరూ అప్రత్తమంగా ఉండాలన్నారు. ఎవరికైనా ఇబ్బందులు తలెత్తతే తక్షణమే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఎమ్మెల్యే కోరారు.

ఏకేసీ కాలనీలో పర్యటించిన గణబాబు

సింధియా: తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన 40వ వార్డు ఏకేసీ కాలనీలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పర్యటించారు. ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న ఆయన గ్రేటర్ కమిషనర్ కేతన్‌గార్గ్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలను ఆశ్రయించాలని కోరారు. ఇదిలావుండగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి యారాడ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అలాగే 63వ వార్డు చింతలలోవ అయ్యంగారి బేకరీ పరిసరాల్లో గల మెట్ల మార్గంలో సోమవారం అర్ధరాత్రి మట్టిపెళ్లలు, రాళ్లు జారిపడ్డాయి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జీవీఎంసీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

విరిగిపడిన కొండచరియలు: పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

గాజువాక: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లో మట్టిపెళ్లలు, చెట్లు విరిగి పలు ఇళ్లపై పడడడంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. గాజువాకలోని కృష్ణానగర్ కొండపై రెండిళ్లపై, పెంటయ్యనగర్ కొండపై మూడిళ్లప మట్టిపెళ్లలు విరిగి పడ్డాయి. అయితే ఆ సమయంలో ఇళ్లల ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. అలాగే బొజ్జన్నకొండపై కొన్ని ఇళ్లపై మట్టిపెళ్లలు పడ్డాయి. కొండవాలు ప్రాంతాల్లో మట్టిపెళ్లలు జారిపడుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారి దయానిధి, తహశీల్దార్ బి.శ్రీనివాసరావుతో కూడిన బృందాలు ఆయా ప్రాంతాలను పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొండవాలు ప్రాంతాల పరిస్థితిని సమీక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియ మించారు. కాగా వర్షపు నీరు గాజువాక పోలీస్ స్టేషన్ ఆవరణలోకి చేరింది.

పొంగిపొర్లిన చెరువులు, గెడ్డలు

పెందుర్తి: వర్షం దంచికొట్టడంతో పలు గ్రామాల్లోని చెరువులు, గెడ్డలు పొంగిపొర్లాయి. వరద నీటి ధాటికి అక్కిరెడ్డిపాలెం జుత్తాడ మార్గంలో గల కల్వర్టు కొట్టుకుపోయింది. వరద నీరు భారీగా వాలిమెరక గ్రామంలోకి చేరడంతో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఏర్పడడంతో ఏఈ బి.రవినాయుడు, సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో నీటిని మళ్లించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పెందుర్తి పెద చెరువు నిండి పొంగడంతో సరిపల్లి ఎన్‌హెచ్-16 హైవే సర్వీస్ రోడ్డు జలమయమైంది. మేహాద్రి కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుడంతో పెందుర్తి రైల్వే ట్రాక్ నుంచి వరద నీరు చేరడంతో గొర్లెవానిపాలెం రోడ్డు నీట మునగడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. విశాఖ-అరకు ప్రధాన రహదారిలో సరిపల్లి వద్ద గల వంతెన కింద తమురు చెరువు వరద నీరు చేరింది. పెందుర్తి ఏకలవ్య కాలనీ, రాంపురం బాపూజీనగర్‌లోకి వరద నీరు చేరడంతో నివాసాలు నీట మునిగే అవకాశం కలిగితే స్థానికులను పునరావాస కేంద్రానికి తరలించేందుకు రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపట్టారు. గుర్రమ్మపాలెంలో జగనన్న కాలనీ నివాసాల్లోకి నీరు చేరగా, వాలిమెరక జుత్తాడలోని జగనన్న కాలనీ రహదారి చిత్తడిగా మారింది. పెందుర్తి టీటీడీసీ, గొరపల్లి, సత్తివానిపాలెంలో చెట్లు నేలకొరగడంతో అధికారులు యంత్రాలతో వాటిని హుటాహుటిన తొలిగించారు.

మేహాద్రి డామ్ ప్రధాన రహదారి మూసివేత

తుఫాన్ ప్రభావంతో జెర్రిపోతులపాలెం నుంచి మేహాద్రి డామ్ ప్రధాని రహదారి మార్గాన్ని పోలీసులు మూసివేశారు. సీఐ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రహదారిని మూసివేసి రాకపోకలను పూర్తిగా నిషేధించారు. మేహాద్రి ఉగ్రరూపం దాల్చుతుండడం... డామ్‌ను తిలకించేందుకు ప్రజలు వచ్చే అవకాశం ఉండడంతో ఈ రహదారిని తాత్కాలికంగా మూసివేశామని సీఐ తెలిపారు.

కొనసాగుతున్న 'మేహాద్రిగెడ్డ' నీటి విడుదల

గోపాలపట్నం: భారీ వర్షాలకు మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు భారీగా ఇన్‌ఫ్లో పెరగడంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా సోమవారం రాత్రికి నీటిమట్టం 60 అడుగులకు చేరింది. దీంతో సోమవారం అర్ధరాత్రి దాటాక 4 గేట్లను ఎత్తి 8,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో మంగళవారం కూడా రిజర్వాయర్ నుంచి వరద నీటి విడుదల కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో మేహాద్రిగెడ్డ జలాశయాన్ని జేసీ మయూర్ అశోక్, పెందుర్తి తహశీల్దార్ ఐ.వెంకట అప్పారావు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ పి.అప్పలనాయుడు, డీఈ స్వామినాయుడు, ఏఈ పి.నళిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు పరిశీలించారు. తుఫాన్ తీవ్రత తగ్గే వరకూ రిజర్వాయర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా రిజర్వాయర్ నుంచి నీటి విడుదల కొనసాగుతున్నందున జలాశయాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెందుర్తి పోలీసులు ఇక్కడ గస్తీ నిర్వహిస్తున్నారు. రిజర్వాయర్ ప్రధాన గేటును మూసి వేసి ఎవరినీ అనుమతించడం లేదు.

నీటి విడుదలతో లోతట్టు ప్రాంతాలు జలమయం

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ గేట్లు ఎత్తి వరద నీటిని విడుదల చేయడంతో కొత్తపాలెం గ్రామ శివారులోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రోడ్డులో సుమారు 400 మీటర్ల పొడువున వరద నీరు ప్రవహించడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. రిజర్వాయర్ గేట్లు దించితే గానీ నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టే పరిస్థితి లేదు. కాగా కొండవాలు ప్రాంతాల నుంచి గెడ్డల ద్వారా వచ్చే వరద నీరు, రిజర్వాయర్ నుంచి వస్తున్న నీటితో కొత్తపాలెం శివారులోని పరదేశమ్మనగర్, గణేశ్‌సాయినగర్ కాలనీలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆయా ముంపు ప్రాంతాల్లో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పర్యటించి, అధికారులను అప్రమత్తం చేశారు. లక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించి బాధితులతో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. బాధితులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు.

ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న కూటమి నాయకులు


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం: మొంథా తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ కూటమి నాయకులతో కలిసి రాసాలమ్మ కాలనీ, సాయిరామ్‌నగర్, తలారివానిపాలెం, తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి వేగుంట శ్రీనివాస్, నాయకులు కాదా శ్రీను, బొడ్డేడ జగదీశ్, కొర్లాన రమేశ్, ఎం.గణపతి, కేవీ సుబ్బయ్య, రాయుడు, నాగార్జున, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా 71 వార్డు తోకాడలో వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలమయంగా మారాయి. 70వ వార్డు శ్రీనివాస నగర్, కుంచుమాంబ కాలనీ,ఆటోనగర్ రోడ్డు, 86, 87 వార్డుల్లో గల దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి కాపు జగ్గరాజుపేట రోడ్డు ఎక్కడపడితే అక్కడ గుంతలు పడ్డాయి. దత్త సాయినగర్ నుంచి యాదవజగ్గరాజుపేట, పకీరుతఖ్యా నుంచి ఆటో నగర్‌కు వెళ్లే రోడ్లు గోతులమయంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

అక్కిరెడ్డిపాలెం: భారీ వర్షాలకు 68, 69 వార్డుల పరిధిల్లో రోడ్ల చెరువులుగా మారగా, నాతయ్యపాలెం, రాంనగర్ కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీటితో నాతయ్యపాలెం కృష్ణమహంతి చెరువు నిండుకుండలా దర్శనమిస్తోంది. చెరువు నిండిపోవడంతో సమీపంలో ఉన్న నాతయ్యపాలెం కాలనీలో గల ఇళ్లల్లోకి నీరు చేరుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుకు గట్టు వేయడంతో పాటు దిగువ ప్రాంతంలోకి నీరు పోయేందుకు చర్యలు చేపట్టారు. హైవే నుంచి షీలానగర్ కు వెళ్లే ప్రధాన రోడ్డుపై గల హరిజన జగ్గయ్యపాలెం వద్ద మోకాల్లోతు నీరు చేరింది. 68వ వార్డు మింది శ్మశానవాటిక చెరువులా మారగా, సమీపంలో గల రైల్వే అండర్ బ్రిడ్జి కింద పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అప్పన్న కాలనీలో విద్యుత్ తీగ తెగిపడగా, సంబంధిత సిబ్బంది తక్షణమే సరిచేశారు. రాంనగర్ కాలనీలో కార్పొరేటర్ గుడివాడ అనూష, గుడివాడ లతీశ్‌లు పర్యటించి రెవెన్యూ , జీవీఎంసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నీటి మునిగిన రోడ్లు

అగనంపూడి: భారీ వర్షాలకు ప్రధాన గెడ్డలు నీరుతో పొంగి ప్రవహించాయి. ముఖ్యంగా శ్రీనివాసనగర్ ప్రధాన గెడ్డ పొంగిపోవడంతో ప్రధాన రహదారిపై పెద్దఎత్తున నీరు ప్రవహించింది. రోడ్డంతా నీటితో మునిగిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. కొండవాగు నుంచే వచ్చే బొర్రమ్మగెడ్డ నీటి ఉధృతికి లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తలారివానిపాలెం, ఫార్మాసిటీ కాలనీల్లోని రోడ్లు ఛిద్రంగా మారాయి. స్టీల్ ప్లాంట్, దువ్వాడ రోడ్డులో నీరు నిలిచిపోయింది. తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సూచించారు. గల్లవానిపాలెం, పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రధాన గెడ్డలతో పాటు డ్రైనేజీలను పరిశీలించారు. కల్వర్టులు పూడికతో నిండిపోవడంతో వర్షపు నీరు రోడ్లపైకి వస్తుండడంతో ఆయన దగ్గరుండి తొలగించే పనిని చేపట్టారు.

వాహన చోదకులకు పోలీసుల సూచనలు


వాహనదారులకు సూచనలు ఇస్తున్న పోలీసులు

జాతీయ రహదారి ఇ-మర్రిపాలెం కూడలిలో మంగళవారం రాత్రి పరవాడ పోలీసులు వాహన చోదకులను అప్రమత్తం చేశారు. రెండు బృందాలుగా పోలీసులు విడిపోయి వచ్చి పోయే ట్రావెల్స్ బస్సులు, భారీ వాహనాల నిలిపివేసి మైకు ద్వారా పలు సూచనలు చేశారు. రాత్రికి తుఫాన్ తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను నిలిపివేసి సురక్షత ప్రాంతాల్లో గడపాలన్నారు. పరవాడ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల ధాటికి రోడ్లకు తూట్లు

పెదగంట్యాడ: వర్షాల ధాటికి అసలే అంతంత మాత్రంగా ఉన్న రహదారులు పలుచోట్ల మరింత గోతులమయంగా మారాయి. ఆయా గోతుల్లో నీరు చేరడంతో వాటి మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. 76వ వార్డుల పరిధిలోని బాలచెరువు కాలనీ, 75వ వార్డు కోరాడ ప్రాంతాల్లో, పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రధాన రోడ్లు గోతులమయమయ్యాయి. కొత్త దిబ్బపాలెం, జాలరిపల్లిపాలెంలోని రోడ్లు ఛిద్రంగా మారాయి. కాగా దయాళ్‌నగర్ కొండవాలు ప్రాంతంలో తహశీల్దార్ అమల పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్నందున సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

సురక్షిత ప్రాంతాలకు అప్పికొండ తీర ప్రాంత ప్రజలు

ఉక్కుటౌన్‌షిప్: అప్పికొండ తీర ప్రాంతం అలకల్లోలంగా ఉండడంతో స్థానికులను సమీపంలో గల సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. ఎప్పటికప్పుడు ఇక్కడి పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. కాగా మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో విధులకు హాజరయ్యే ఉక్కు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమయానికి గేటు మూసివేసే మూసే సీఐఎస్ఎఫ్ సిబ్బంది వర్షాల దృష్ట్యా కొంత సమయం వెసులుబాటు కల్పించి, ప్రతి ఉద్యోగిని లోపలకు అనుమతించారు. ప్లాంటులో, టౌన్‌షిప్‌లో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

వార్డుల్లో కార్పొరేటర్ల పర్యటన

వేపగుంట/ఎన్ఏడీ: భారీ వర్షాలకు 93వ వార్డులో దుర్గానగర్ బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని ఉన్న కల్వర్టు చిన్నదిగా ఉండడంతో కాలనీలోకి నీరు ప్రవేశించింది. కార్పొరేటర్ రాపర్తి కన్నా గ్రేటర్ అధికారులత కలిసి ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ సమస్య పరిష్కారానికి కొత్తగా కల్వర్టు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. 94వ వార్డు శేనాతివానిపాలెం, పురుషోత్తపురం, ఆర్టీసీ కాలనీల్లో ముంపు ప్రాంతాలను కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పరిశీలించారు. 98వ వార్డు శ్రీ లక్ష్మీ నరసింహనగర్‌లో పార్కును ఆనుకుని ఉన్న గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఒక విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. 90వ వార్డు లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 52వ వార్డు ఎన్ఏడీ సమీప గౌరీనగర్‌లో నివసిస్తున్న రోజువారీ కూలీలకు మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ భోజన వసతిని ఏర్పాటు చేశారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే 'పల్లా'

గాజువాక: తుఫాన్ ప్రభావంతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు సజావుగా ముందుకు పారేందుకు మార్గాలను సుగమం చేయాలని, ఎక్కడైనా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోతే తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కొండవాలు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అత్యవసరమైతే ప్రజలకు తాగునీరు, ఆహారం, మందులు, పాలు అంజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ప్రత్యేక అధికారి దయానిధి, జడ్సీ శేషాద్రి, తహశీల్దార్లు బి.శ్రీనివాసరావు,అమల, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

సమర్థంగా ఎదుర్కొద్దాం: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. నిధులు లేవని సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించవద్దని, ఎంత ఖర్చయినా భరిద్దామన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతాల నీటి ముంపు రక్షణ చర్యలపై సమీక్షించారు. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా సైనికుల్లా యుద్ధం చేయాలని సూచించారు. పునరావాస కేందాల్లో ఆహారంతో పాటు అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. సమీక్షలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్‌బాబు

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 36, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 48, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 38, బీరకాయలు 40, ఆనపకాయ 24, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 26, క్యారెట్ 62, దొండకాయలు 44, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 70, బరబాటి 44, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 50, బద్ధచిక్కుడు 66, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 20, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 32, కంద 48, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 22, మామిడి అల్లం 90, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

సహాయక చర్యలకు ఇబ్బంది లేకుండా చూడండి: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఇబ్బంది లేకుండా చూడాలని జీవీఎంసీ అధికారులకు కలెక్టర్ ఎంఎన్ హరేంధిప్రసాద్ సూచించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మంగళవారం నగరంలో వరద పరిస్థితి, సహాయక చర్యలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులతో సమావేశమై వార్డు సచివాలయాల వారీగా సహాయక చర్యలు, కూలిపోయిన చెట్లు, స్తంభాలు, ప్రహరీలను తొలగించడం, రోడ్లపై వర్షంనీరు నిలిచిపోతే తొలగించే చర్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లోని వారికి మౌలిక వసతుల కల్పనపై పరిశీలించి, ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు.

తుఫాన్ ప్రభావంపై మేయర్, కమిషనర్ సమీక్ష

నగరంలో వరద పరిస్థితిపై మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్‌గార్గ్ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి మంగళవారం వేర్వేరుగా సమీక్షించారు. కాకినాడ వద్ద తుఫాన్ తీరం దాటడంతో బుధవా రం తెల్లవారుజాము వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమతం చేయాలని మేయర్ ఆదేశించారు. అనంతరం తన చాంబర్‌లో నగర పరిధిలోని ఎమ్మెల్యేలు, జోనల్ కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పునరావాసకేంద్రాల్లోని వారికి ఆహారం, తాగునీటికి సమస్య లేకుండా చూడాలని జడ్సీలకు సూచించారు.

పైపు లైన్‌కు లీకేజీ

మల్కాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కల్వర్టు వద్దనున్న ఎంఈఎస్ పైపు లైన్ లీక్ అవ్వడంతో పెద్దఎత్తున తాగునీరు వృథాగా పారింది. కల్వర్టు కింద చెత్తాచెదారాన్ని అధికారులు, టీడీపీ నాయకులు మంగళవారం తొలగించేందుకు పరిశీలించగా పైపు లైన్ లీకవుతున్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని ఎంఈఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

నిలిచిన భారీ వాహనాలు

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్ర రూపం దాల్చినందున అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జాతీయ రహదారంపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మంగళవారం సాయంత్రం నుంచి షీలానగర్-డాక్‌యార్డు రహదారిలో, షీలానగర్ వద్ద హైవే పక్కన, సర్వీస్ రోడ్డులో ట్రక్కులు, ట్రాలర్లు, ఇతర భారీ వాహనాలను అధికారుల సూచనల మేరకు ఆయా డ్రైవర్లు నిలిపివేశారు.

వెంకటాద్రిపై పవిత్రోత్సవాలకు శ్రీకారం

పెందుర్తి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలకు శ్రీకారం చుట్టారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకుర్పారణతో రుత్వికులు శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం శ్రీవారి మూలవిరాట్‌కు పవిత్ర ప్రతిష్ఠ, 30న పవిత్ర సమర్పణ, 31న పవిత్ర విసర్జనతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి.

పేదలకు భోజనాల పంపిణీ

ఆటోనగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 71వ వార్డు కొండవాలు ప్రాంత ప్రజలు ఇళ్లకే పరిమితం కావడాన్ని గుర్తించిన టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు పప్పు రాజారావు సుమారు 400 మందికి భోజన సదుపాయాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనగర్, శ్రీరామ్‌నగర్, ఉప్పర కాలనీ,సుందరయ్యకాలనీ, దుర్గానగర్, రెల్లి కాలనీల్లోని పేదలకు భోజనాలను అందించామన్నారు. ఎమ్మెల్యే పల్లా ఆదేశాల మేరకు పేదలకు అండగా ఉంటున్నామన్నారు.

సినిమా గైడ్

- **బైసన్** : శారదా,
- **తమ్మా** : రమాదేవి
- **డూడ్** : శరత్, శ్రీరామా, లీలామహల్, శ్రీకన్య, ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం),
- **ఓజీ** కిన్నెర, కామేశ్వరి, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య,
- **మిరాయి**: సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

మొంథా ప్రభావం

» ఎడతెరిపి లేని వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తం » పలుచోట్ల కుప్పకూలిన చెట్లు
» రహదారులపైకి భారీగా వరద నీరు... రాకపోకలకు వాహనదారుల ఇక్కట్లు
» సహాయక చర్యల్లో యంత్రాంగం నిమగ్నం » పర్యవేక్షించిన కలెక్టర్, ఉన్నతాధికారులు

మొంథా తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. ఎడతెరిపిలేని వర్షాలతో జన జీవనం స్తంభించింది. గాలులకు పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. వానలకు తడిసి గోడలు కూలిపోయాయి. అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి, సత్వర సహాయక చర్యలు చేపడుతున్నారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


టింపనీ స్కూలు ఎదురుగా ఉన్న ఇంటి వద్ద కూలిన ప్రహరీ గోడ


ఏవీఎన్ కాలేజీ సమీపంలో ఆటోపై కూలిన కేజీహెచ్ ప్రహరీ గోడ


పెదజాలారిపేటలో తీరానికి చేరిన బోట్లు, గాలులకు ఊగుతున్న చెట్లు


ఆర్‌కే బీచ్ వద్ద అలల ఉధృతి


చావులమదుం బ్రిడ్జి వద్ద నిలిచిన నీటిలో వాహనాల రాకపోకలు


సింహగిరిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గంగధార

సింహగిరిపై జలసిరి

సింహాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో సింహగిరి జల కళ సంతరించుకుంది. గంగధార పెద్దఎత్తున ప్రవహిస్తోంది. దేవస్థానం, జీవీఎంసీకి చెందిన సుమారు పది లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ట్యాంకుల్లో నీటిని నింపి, మిగిలిన నీటిని దిగువకు వదిలేశారు. దానికి సమీపంలోని పిచ్చుకధార భక్తులను కనువిందు చేస్తోంది. స్వామి ప్రసాదాల తయారీకి నీటిని అందించే అనంతధార (వంటధార) ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాల కారణంగా సింహగిరి మెట్ల మార్గంలో భక్తుల రాకపోకలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కొండదిగువన తొలిపావంచా వద్ద, సింహగిరిపై మెట్ల ప్రారంభంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మెట్లమార్గంలో భారీగా వర్షం నీరు ప్రవహిస్తుండడంతో భక్తులు ఎటువంటి ప్రమాదాల బారినపడకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు తెలిపారు.


సింథియా- మల్కాపురం రహదారిలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ పర్యటన


సిరిపురం సీబీఎం కాంపౌండ్ గేట్-ఏ వైపు కూలిన గోడ


కొమ్మాది టీచర్స్ లేఅవుట్‌లోని అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి చేరిన నీరు

గాలులకు కూలిన చెట్లు


సీతమ్మధారలో కారుపై కూలిపోయిన చెట్టు


ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు


పెదవాల్తేరు రాణిచంద్రమణిదేవి ఆస్పత్రి ఎదురుగా..


ఎంవీపీ కాలనీలో ఇంటిపై కూలిపోయిన చెట్టు


కురుపాం జంక్షన్‌లో నేలకొరిగిన భారీ వృక్షం


వెలంపేట వద్ద ఇంట్లోకి వచ్చిన వర్షపు నీటిని తోడుతున్న మహిళ

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ఠ్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సువర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకోని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్దీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ 'తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.